విలేకరులు కావలెను
ప్రజాలేఖ
పక్ష పత్రికలో
పనిచేయుటకు విలేకరులు
కావలెను..
సంప్రదించండి : 92469 36059

RNI Number TELTEL/2015/62050

# ప్రజాలేఖ

సామాజిక రాజకీయ పక్షపత్రిక
PRAJALEKHA TELUGU FORTNIGHTLY

సంపుటి: 11 | సంచిక: 20 | ఎడిటర్ : బుస్స బుచ్చిబాబు | 16-31 జనవరి 2026 | పేజీలు : 08 | వెల : 5.00

## భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయాల అభివృద్ధి పనులు : మంత్రి సీతక్క



**(వేములవాడ)**

భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులను సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేయిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు. వేములవాడ పట్టణంలోని భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రి సీతక్క శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అత్యంత భక్తుల రద్దీ ఉండే ఆలయాల అభివృద్ధి, విస్తరణ పనులకు సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని వివరించారు. వేములవాడ రాజన్న ఆలయ విస్తరణ పనుల విషయమై ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, లక్ష్మణ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకెళ్లగా, సీఎం, మంత్రులు హాజరై ఆలయ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. రూ. 150 కోట్లతో రాజన్న ఆలయ విస్తరణ పనులు కొనసాగుతున్నాయని అన్నారు. భక్తులకు మెరుగైన వసతులు, దర్శన భాగ్యం త్వరలోనే అందుబాటులోకి రానున్నదని తెలిపారు.

అలాగే మేడారంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల పునర్నిర్మాణం, అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. ఆదివాసి పూజారులు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా గద్దెల పునర్నిర్మాణం, వివిధ అభివృద్ధి పనులు వందల ఏండ్ల పాటు నిలిచిపోయేలా.. రెండు వందల కోట్ల రూపాయలకు పైగా మంజూరు చేసి.. రానున్న తరాలకు చరిత్ర తెలిసేలా పనులు సీఎం రేవంత్ రెడ్డి చేయించారని వివరించారు.

రూ.150 కోట్ల నిధులతో వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు ప్రజా ప్రభుత్వంలోని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో శ్రీకారం చుట్టారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. రాజన్న భక్తులకు వేగంగా స్వామి వారి దర్శనం, మెరుగైన వసతులు కల్పించేలా పనులు సాగుతున్నాయని వివరించారు.

ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి, చొరవతోనే సీఎం రేవంత్ రెడ్డి నిధులు మంజూరు చేస్తున్నారని అన్నారు. మేడారంలో కూడా అభివృద్ధి పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు. మేడారంలో మొక్కలు చెల్లించుకునే ముందు వేములవాడకు రావడం ఆనవాయితీగా వస్తుందని వివరించారు. ప్రజా ప్రభుత్వంలో ఆలయాల నిర్మాణం, విస్తరణ పనులు వేగంగా పూర్తి అవుతున్నాయని తెలిపారు.

ఈ నెల 18వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు మేడారం రానున్నారని, అక్కడే కేబినెట్ సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ నెల 19వ తేదీన మేడారం జాతర పనులను సీఎం, మంత్రులు ప్రారంభిస్తారని వెల్లడించారు. మేడారం జాతరకు ముందు రాజన్న ఆలయాన్ని దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తుందని, అందులో భాగంగానే తాను ఇక్కడికి వచ్చానని వివరించారు. మేడారం జాతరకు అన్ని పార్టీల ఎమ్మెల్యేలకు స్వాగతం పలికామని, భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి తల్లులను దర్శించుకోవాలని కోరారు.



## చెనాకా కోరాటా బ్యారేజీ, సదర్ మాట్ ప్రాజెక్టులకు శ్రీకారం

### ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల జిల్లాలకు సాగు జలాలు విడుదల
### పదేళ్లకు ప్రాజెక్టులు సాకారం.. ఆయకట్టు రైతుల్లో ఆనందం

**(ఆదిలాబాద్)**

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో గోదావరి, పెన్ గంగా పరివాహక ప్రాంతాల్లో పదేళ్ల కిందట చేపట్టిన రెండు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ మహారాష్ట్ర సరిహద్దుల్లోని లోయర్ పెనుగంగా పై నిర్మించిన చెనాకా కోరాటా బ్యారేజీని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి పంప్ హౌస్ వద్ద పూజలు చేసి నీటిని విడుదల చేశారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ బేలా బోరజ్, బీంపూర్ మండలాలకు 51 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు ద్వారా బీడు భూములు సస్య శ్యామలం కానున్నాయి.

**భూ పరిహారం కింద రూ. 71 కోట్లు రైతులకు అందజేత..** సీఎం రేవంత్ రెడ్డి చెనాకా కోరాటా బ్యారేజీ నుంచి 0.81 టీఎంసీల నీటిని (ఝెవతీ) ఎత్తిపోసే ప్రధాన కాలువకు పూజలు చేశారు. జైనథ్, బేల,బోరజ్ మూడు మండలాల పరిధిలో 42 కిలోమీటర్లు కాల్వల నిర్మాణం చేపట్టగా పూజలు చేసి పెన్గంగా జలాలను దిగువకు వదిలి పెట్టారు. రూ. 1,891 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కు ఇప్పటివరకు రూ 1,105 కోట్లు వెచ్చించారు. చెనాక కోరట ప్రాజెక్టు ప్రాజెక్టు ప్రారంభోత్సవంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఎంపీ గోడెం నగేష్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, అనిల్ జాదవ్, కలెక్టర్ రాజార్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**సదర్ మాట్ బ్యారేజీ నీటిని విడుదల చేసిన సీఎం..** నిర్మల్ జిల్లా మామడ మండలం పోనకల్ వద్ద పదేళ్ల కిందట చేపట్టిన సదర్ మాట్ బ్యారేజీ ద్వారా గోదావరి జలాలను సీఎం రేవంత్ రెడ్డి దిగువ ఆయకట్టుకు వదిలిపెట్టారు.

గోదావరి జలాలను నిల్వ సామర్థ్యం పెంచుకునేలా ఈ బ్యారేజీ నిర్మించారు. రూ.520.39 కోట్ల అంచనా వ్యయంతో బ్యారేజీ నిర్మించగా నిర్మల్ జిల్లా ఆయకట్టుకు 13,120 ఎకరాలు, జగిత్యాల జిల్లాలో 4,896 ఎకరాలకు సాగునీరు అందం ఉంది. యాసంగి పంటకు సీఎం రేవంత్ రెడ్డి నీటిని విడుదల చేయడంతో రైతుల్లో హర్షాతిరేకం వ్యక్తం అయింది. సీఎం వెంట మంత్రి ఉత్తరం కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, ఎమ్మెల్యే వెడమ బొజ్జు, కలెక్టర్ అభిలాష అభినయ్, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మీకిదే చివరి అవకాశం..

## ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో స్పీకర్‌కు సుప్రీం హెచ్చరిక



**(హైదరాబాద్)**

తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకుంటారా? మేమే నిర్ణయం తీసుకోవాలా అని సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. మీకిదే చివరి అవకాశం ఇస్తున్నామని రెండు వారాల్లో నిర్ణయం తీసుకోకపోతే మేమే నిర్ణయం తీసుకుంటామని సుప్రీం ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు వారాల్లో ఎమ్మెల్యేల అనర్హత వేటుపై స్పీకర్ తీసుకున్న చర్యల అఫిడవిట్ ఇవ్వాలని ఆదేశించింది. బీఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా ఇప్పటి వరకు స్పీకర్ ఏడుగురు ఎమ్మెల్యేలకు సంబంధించిన పిటిషన్లపై తీసుకున్న చర్యలను న్యాయవాది అభిషేక్ సింఘ్వీ కోర్టుకు నివేదించారు.

దీంతో మిగతా వారిపై 2 వారాల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించగా ఇందుకు అభిషేక్ సింఘ్వీ గడువు కోరారు. మిగతా ముగ్గురు ఎమ్మెల్యేల విచారణ పూర్తి చేసేందుకు 4 వారాలల సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీంతో ఇప్పటికే స్పీకర్?కు చాలా సమయం ఇచ్చామని ఇదే ఇదే చివరి అవకాశం అని స్పష్టం చేసింది. ఇప్పుడు సకాలంలో నిర్ణయం తీసుకోకుంటే కీలక పరిణామాలు ఉంటాయని హెచ్చరిస్తూ తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా వేసింది. కాగా మొత్తం 10 మంది ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు రాగా వారిలో అరికపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్, ప్రకాష్ గౌడ్, తెల్లం వెంకట్రావు, పోచారం శ్రీనివాస్ రెడ్డి, కాలే యదయ్యకు స్పీకర్ క్లీన్ చిట్ ఇచ్చారు. మిగిలిన ముగ్గురు ఎమ్మెల్యేల విషయంలో దానం నాగేందర్ విషయంలో స్పీకర్ వేటు తప్పదనే టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో గడ్డం ప్రసాద్ కుమార్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి.

## రైతులకు న్యాయమైన ధర కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యం : మంత్రి తుమ్మల

**(హైదరాబాద్)**



తెలంగాణ రైతులకు న్యాయమైన ధర కల్పనే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. తెలంగాణలో 4,99,393 ఎకరాల్లో కందులు సాగు చేశారని తెలిపారు. క్వింటాల్ కందులకు ఎమ్ఎస్పీ రూ.8 వేలుగా ఉందని అన్నారు. మార్చి 2026 వరకు కందుల కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఈసారి రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా ధాన్యాన్ని సేకరించి నిజామాబాద్ జిల్లా టాప్‌లో నిలిచింది. ఇప్పటి వరకు 6.93 లక్షల మెట్రిక్ టన్నులు వరి ధాన్యం సేకరణతో నంబర్ వన్ జిల్లాగా ఉంది. రెండో స్థానంలో నల్లగొండ నిలవగా ఇక్కడ 5.23 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యాన్ని కొనుగోలు చేపట్టారు. కాంగ్రెస్ సర్కార్?కొలువు దీరిన తరువాత ఉమ్మడి ఈరెండు ఉమ్మడి జిల్లాలో ధాన్యం ఉత్పత్తిలో పోటీ పడుతున్నాయి. పౌరసరఫరాల శాఖ కూడా ఇక్కడ అమ్మకాలు చేసిన రైతులకు వారం రోజుల్లో నగదు బ్యాంకు ఖాతాలో జమ చేయడంతో రైతులు ప్రైవేటు వ్యాపారులకు అమ్మకాలు చేయకుండా ప్రభుత్వం కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నారు.

## హైదరాబాద్ మెట్రో రెండో దశ.. సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి లేఖ

**(హైదరాబాద్)**

హైదరాబాద్ మెట్రో రెండో దశ పనుల పురోగతిపై సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి లేఖ రాశారు. "ఇప్పటికే మెట్రోను ఎల్&టి నుంచి స్వాధీనం చేసుకుని.. రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహిస్తుందని మీరు ప్రకటించారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసి మెట్రో రెండో దశ నిర్మాణం గురించి చర్చించాను. ముందుగా మెట్రో మొదటి దశను ఎల్&టి నుంచి రాష్ట్ర ప్రభుత్వం టేకోవర్ చేసుకోవాలని ఖట్టర్ చెప్పారు. అందుకు సంబంధించిన ఒప్పందాలు, నిర్ణయాలు, లావాదేవీలు పూర్తి కావాలన్నారు. ఆ తర్వాత రెండో దశ నిర్మాణంపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ మెట్రో రెండో దశ నిర్మాణానికి అంగీకరించిందని కూడా ఖట్టర్ గుర్తు చేశారు" అని కిషన్ రెడ్డి లేఖలో పేర్కొన్నారు.

మెట్రో మొదటి దశను రాష్ట్ర ప్రభుత్వం ఎల్&టి నుంచి తీసుకోవడం, రెండో దశకు సన్నాహాల కోసం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం కలిసి సంయుక్తంగా కమిటీ ఏర్పాటు చేయడంపై సీఎంతో చర్చించి నిర్ణయించినట్లు కూడా ఖట్టర్ తెలిపారని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు, కేంద్ర ప్రభుత్వం తరఫున ఇద్దరు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారని.. కానీ, ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారుల పేర్లను ప్రతిపాదించలేదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇద్దరు అధికారుల పేర్లు పంపాలని కోరారు.

## ఇరాన్ చెరలో భారత నావికులు.. కుటుంబీకుల ఆందోళన!

**(ఢిల్లీ)**

భారత్‌కు చెందిన 16 మంది నావికులు గతనెల ఇరాన్‌లో చిక్కుకున్న విషయం తెలిసిందే. వీరిని అక్కడి భద్రతా సిబ్బంది అరెస్టు చేసినట్లు వార్తలు వచ్చిన నేపథ్యంలో బాధిత కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నావికులను సురక్షితంగా వెనక్కి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఈ అంశానికి సంబంధించి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది.

యూఏఈలోని దిబ్బా పోర్టు సమీపంలో అంతర్జాతీయ జలాల్లో వెళ్తున్న వాలియంట్ రోర్ అనే నౌకను ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ గతేడాది డిసెంబర్ 8న వెంబడించారు. ఆ నౌకలో 6వేల మెట్రిక్ టన్నుల ఇంధనం స్మగ్లింగ్ చేస్తోందని ఆరోపిస్తూ.. అందులో ఉన్న సిబ్బందిని నిర్బంధించారు. ఆ సమయంలో నౌకలో 18 మంది నావికులు ఉండగా వారిలో 16 మంది భారతీయులున్నట్లు సమాచారం. వీరిలో పది మందిని జైలుకు తీసుకెళ్లగా మిగతా వారు ఇరాన్ గార్డుల నిఘాలో నౌకలోనే ఉన్నట్లు తెలుస్తోంది. వీరంతా ఆర్‌పీఎస్ఎల్-లైసెన్స్ (భారత్‌తో పాటు విదేశీ నౌకల్లో పని చేసేందుకు ఈ సంస్థలు నియామకాలు చేపట్టే సంస్థలు) ఉన్న నావికులేనని సమాచారం. ఈ ఘటనకు సంబంధించి నౌక కెప్టెన్ నుంచి కుటుంబీకులకు అత్యవసర సందేశం అందింది. ఇందులో ఖేతన్ మెహతా అనే ఇంజినీర్ తల్లిదండ్రులు భారత్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇరాన్ ప్రభుత్వంతో చర్చించి తమ వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అంతలోపు వారికి వైద్య, న్యాయ, ఆర్థికసాయం అందించేలా ఇరాన్‌లోని భారత కాన్సులేట్‌ను ఆదేశించాలని కోరుతూ బాధిత కుటుంబీకులు ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. ఈ అంశానికి సంబంధించి స్టేటస్ రిపోర్టును అందజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను జనవరి 21కి వాయిదా వేసింది.



## జనవరి 20న బిజెపి నూతన అధ్యక్షుడి ప్రకటన



**(ఢిల్లీ)**

భారతీయ జనతా పార్టీకి మరికొన్ని రోజుల్లో కొత్త సారథి రానున్నారు. పార్టీ నూతన అధ్యక్షుడి కోసం ఎన్నిక తేదీని భాజపా శుక్రవారం ప్రకటించింది. ఈ పదవికి జనవరి 19న నామినేషన్లు దాఖలు కానున్నట్లు తెలిపింది. ఆ మరుసటి రోజు జనవరి 20న కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నట్లు వెల్లడించింది.

ఈ మేరకు భాజపా రిటర్నింగ్ అధికారి కె.లక్ష్మణ్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. 19వ తేదీ మధ్యాహ్నం 2-4 గంటల మధ్య అభ్యర్థులు తమ నామినేషన్లను సమర్పించవచ్చని లక్ష్మణ్ తెలిపారు. ఆ తర్వాత నామినేషన్ల పరిశీలన చేపడతామన్నారు. అదేరోజు సాయంత్రం 5-6 గంటల మధ్య నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్నిక అవసరమైతే జనవరి 20న పోలింగ్ నిర్వహించి విజేతను ప్రకటిస్తామన్నారు. ఈ ప్రక్రియంతా భాజపా ప్రధాన కార్యాలయంలో జరగనుంది. కాగా.. ఇటీవల కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమితులైన 45 ఏళ్ల నితిన్ నబీన్‌నే పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని అధిష్ఠానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. యువనాయకత్వాన్ని తయారుచేసుకోవడడంలో భాగంగా నబీన్‌కు పార్టీ సారథ్య పగ్గాలు అప్పగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. బిహార్‌కు చెందిన నితిన్ నబీన్ సిన్హాను భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా నియమిస్తూ గతేడాది డిసెంబరులో పార్టీ అనూహ్య ప్రకటన చేసిన సంగతి తెలిసిందే. కాయస్థ సామాజికవర్గానికి చెందిన నబీన్ సిన్హాకు ఆరెస్సెస్ నేపథ్యం ఉంది. గతేడాది జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బాంకీపుర్ నుంచి నాలుగోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. బిహార్ నుంచి పార్టీలో ఆ స్థాయికి చేరిన తొలినేతగా నబీన్ గుర్తింపు సాధించారు.

# కాలుష్య కట్టడి ఎలా..



ముంబై నగర వాయు కాలుష్య సంక్షోభంపై బాంబే హైకోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఏళ్లు గడుస్తున్నా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మారకపోవడానికి ప్రధాన కారణం డేటా లేకపోవడం . నిబంధనల అమలు లో వైఫల్యమేనని స్పష్టమవుతోంది. గాలి నాణ్యత క్షీణతకు, ఊపిరితిత్తుల వ్యాధులకు ప్రత్యక్ష సంబంధం ఉన్నట్లు ఎటువంటి ఆధారాలు లేవని కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో పేర్కొనడం అందరి దృష్టిపథంలో ఉంది. అదే సమయంలో అసలు దానికి సంబంధం ఉందో లేదో నిర్ధారించే డేటా సేకరణ మాత్రం జరగలేదు. అది యాధృచ్ఛికమో.. లేక నిజంగానే కనెక్షన్ ఉందో తెలీదు కానీ.. ప్రభుత్వం " గాలి కాలుష్యకారకమైన వ్యాధులపై పోరాటానికి అవసరమైన ప్రయత్నాలు చేస్తున్నాం.." అని చెబుతూ ఉంటుంది. సెన్సార్లు పనిచేయకపోవడం అన్నది గాలి కాలుష్యం విషయానికి సంబంధించిన ఆందోళనలో ఒక పరిపాటిగా మారిపోయింది. కాలుష్య నియంత్రణ సెన్సార్లు అనేకచోట్ల పని చేయడం లేదని బాంబే హైకోర్టు స్వయంగా గుర్తించింది. నిర్మాణ ప్రాంతాల్లో కాలుష్య నివారణ మార్గదర్శకాలను అమలు చేస్తున్నట్లు బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ రికార్డుల్లో చూపిస్తున్నప్పటికీ, వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అధికారిక డేటా అంతా బాగున్నట్లు భ్రమింపజేస్తున్నా, జనం అనుభవిస్తున్న కాలుష్యం మాత్రం వేరే కథ చెబుతోంది. జనసాంద్రతకు అనుగుణంగా సెన్సార్ నెట్‌వర్క్ లేకపోవడంతో, కోర్టులు కూడా సరైన సమాచారం లేని శూన్య స్థితిలో నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తోంది.పాండమిక్ తర్వాత మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద ఆరోగ్య సంక్షోభం వాయు కాలుష్యమే అయినప్పటికీ, దీనిపై తగినంత శ్రద్ధ లేకపోవడం విచారకరం. ముంబై, ఢిల్లీ వంటి నగరాల్లో శ్వాస పీల్చడం అంటే రోజుకు పదుల సంఖ్యలో సిగరెట్లు తాగడంతో సమానమని వార్తలు వస్తున్నా, జనం దాన్ని అలవోకగా తీసుకుంటున్నారు. ఇది కేవలం ఆరోగ్య సమస్యే కాదు, పెరుగుతున్న వైద్య ఖర్చుల వల్ల దేశంపై భారీ ఆర్థిక భారంగా పరిణమిస్తోంది. ముక్కలు ముక్కలుగా ఉన్న నిబంధనలు, ఆచరణకు సాధ్యం కాని విధానాల వల్ల వాయు స్వచ్ఛత లక్ష్యాలు నెరవేరడం లేదు. ఈ పరిస్థితికి చాలా కారణాలున్నాయి. సరైన నియంత్రణలు లేకపోవడం...వాటిని అమలు చేయడంలో సమన్వయ లోపం, ఆశావహ విధానాలు లేకపోవడం.. వాస్తవికత ఆధారంగా పనిచేయకపోవడం ఇవన్నీ కారణాలే. స్వచ్ఛమైన గాలి కోసం మనం విధించుకునే లక్ష్యాలు..వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థ అవసరాల మధ్య సమతుల్యం కూడా అవసరమే. నా దృష్టిలో, ఇవన్నీ రెండు ప్రధాన లోపాలున్నాయి. ఒకటి డేటా లేకపోవడం.. అదే ముఖ్యమైంది. ఇక రెండోది ప్రత్యక్ష ఆర్థిక ప్రోత్సాహకాలు, జరిమానాలు లేకపోవడం. (కాలుష్య నియంత్రణకు సంబంధించి) ఈ వ్యాసంలో ప్రస్తావించిన ఇతర కారణాలు సహా మిగతా అన్ని అంశాలు..ఈ మొదటి లోపాన్ని సరిదిద్దకుండా పరిష్కరించలేము.కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వార్డులో, ప్రతి లోకాలిటీలో తక్కువ ఖర్చుతో కూడిన ఆధునిక సెన్సార్లను ఏర్పాటు చేయాలి. కేవలం ముంబైని మాత్రమే కాకుండా, ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ మొత్తాన్ని ఒకే 'ఎయిర్ షెడ్'గా పరిగణించి అధ్యయనం చేయాలి. సముద్రపు గాలుల వల్ల కాలుష్యం ఎక్కడి నుంచి ఎక్కడికి చేరుతుందో తెలిస్తేనే మూలాలను అరికట్టగలం. 2023లో ఎమి బాంబే, ఔఇఇఖీఎ వంటి సంస్థలు ఇచ్చిన నివేదికలను ఇప్పటికైనా అమలు చేయాలి. వీటితో పాటు, కాలుష్యం తగ్గించే వారికి పన్ను రాయితీలు ఇవ్వడం, ఉల్లంఘించే వారికి భారీ జరిమానాలు విధించడం వంటి 'ఫిస్కల్ ఇన్సెంటివ్స్' విధానాన్ని ప్రవేశపెట్టాలి. బలమైన రాజకీయ సంకల్పం లేకపోతే, మనం పీల్చే గాలిని చూస్తూ కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలోనే ఉండిపోతాం.శ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మరోవైపు ప్రపంచానికే పొగమంచు రాజధానిగా పేరుపొందిన చైనా రాజధాని బీజింగ్ గడచిన దశాబ్ద కాలంలో వాయు నాణ్యతను గణనీయ స్థాయిలో మెరుగుపరుచుకుంది. గడచిన వారం రోజులుగా ఢిల్లీలో వాయు నాణ్యత దారుణంగా పడిపోయిన నేపథ్యంలో ఈ గండం నుంచి గట్టెక్కడానికి చైనీస్ ఎంబసీ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసింది.

పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న దరిమిలా ఉత్పన్నమయ్యే వాయు కాలుష్యంపైన ఎలా పోరాడాలో భారత్, చైనాకు తెలుసునని చైనీస్ ఎంబసీ అధికార ప్రతినిధి యూ జింగ్ తన పోస్టులో పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి రాత్రికి రాత్రే రాదని, కాని దాన్ని సాధించగలమని ఆమె తెలిపారు. డిసెంబర్ 15న ఢిల్లీలో వాయు ప్రమాణ సూచి(ఏక్యూ) 447 ఉండగా బీజింగ్‌లో 67 పాయింట్లు ఉంది. ఈ రెండు స్క్రీన్‌షాట్లను ఆమె తన పోస్టులో షేర్ చేశారు.మొదటి దశలో వాహన కాలుష్యాన్ని అరికట్టేందుకు బీజింగ్ తీసుకున్న చర్యలను ఆమె వివరిస్తూ ఎక్కువ కాలుష్యాన్ని వెదజల్లే పాత వాహనాలను తొలగించి యూరో 6 నిబంధనలను కఠినంగా అమలు చేసినట్లు ఆమె చెప్పారు. లైసెన్స్-ప్లేట్ లాటరీలు, బేసి, సరి సంఖ్య తేదీల్లో వాహనాలపై ఆంక్షలు, మెట్రో, ప్రజారవాణా వ్యవస్థలో భారీ పెట్టుబడులు పెట్టడం, విద్యుత్తు బస్సులు, వాహనాల వినియోగాన్ని పెద్ద ఎత్తున తీసుకురావడం వంటి చర్యలను ఆమె సూచించారు.రెండవ దశలో పారిశ్రామిక పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. బీజింగ్‌లో 3,000కు పైగా భారీ పరిశ్రమల మూసివేత లేక వేరే ప్రాంతాలకు తరలింపు జరిగినట్లు చెప్పారు. చైనాలోని అతి పెద్ద ఉక్కు తయారీ సంస్థల్లో ఒకటైన షౌగాంగ్‌ని వేరే చోటుకు తరలించడంతో 20 శాతం వాయు కాలుష్యం తగ్గినట్లు వివరించారు. ఖాళీ చేసిన ఫ్యాక్టరీల స్థలాలను పార్కులు, వాణిజ్య జోన్లు, టెక్ హబ్‌లుగా మార్చాలని ఆమె సూచించారు.

# మాస్టర్ ప్లాను విస్తరణ..?

## ఔటర్ రింగురోడ్డు వరకూ రాజధాని రోడ్లు మధ్య ప్రాంతం మొత్తంలో ప్లానింగు



అమరావతి : అమరావతి రాజధాని విస్తరణలో భాగంగా రెండోదశ పూలింగు ప్రక్రియ ప్రారంభించిన సిఆర్‌డిఏ త్వరలో మాస్టర్‌ప్లానునూ విస్తరించనున్నట్లు తెలిసింది. పూలింగు ప్రక్రియ ముగిసిన అనంతరం ప్లానింగు విస్తరణకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభించనున్నారు. 189 కిలోమీటర్ల పొడవైన అమరావతి ఔటర్ రింగురోడ్డుకు ఇప్పటికే గెజిట్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనికితోడు ఇన్నర్ రింగురోడ్డు నిర్మాణమూ చేపట్టనున్నారు. అయితే ప్రస్తుతం ఉన్న మాస్టర్ ప్లానును విస్తరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ఇటీవల మంత్రి నారాయణ వెల్లడించారు. ప్రస్తుతం ఉన్న రోడ్లను రెండోదశ పూలింగు ప్రాంతానికి విస్తరించనున్నామని, వీటిని ఔటర్ రింగుకు అన్నివైపులా కలిపేలా ప్లానింగు ఉందనీ పేర్కొన్నారు. దీని ప్రకారం తూర్పున 16వ నెంబరు జాతీయ రహదారి హద్దుగా దక్షిణం, పడమర ప్రాంతంలో ఔటర్ రింగురోడ్డు, ఉత్తరాన కృష్ణానది ప్రాంతం మధ్యలో పూర్తిగా ప్లానింగు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. దాదాపుగా సిఆర్‌డిఏ రీజియన్ ప్రాంతం మొత్తం సమగ్ర ప్లానింగు పరిధిలోకి వస్తుంది. ప్రస్తుతం సిఆర్‌డిఏ ప్రాంతం సుమారు 8352 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉంది. అంటే సుమారుగా 20.88 లక్షల ఎకరాలకు విస్తరించి ఉంది. దీనిలో కనీసం మూడు లక్షల ఎకరాల పరిధిలోకి రాజధాని ప్లానింగు ఏరియా పెరుగుతుందనేది అంచనాగా వేస్తున్నారు. ప్రస్తుతం 16వ నెంబరు జాతీయ రహదారికి ఈ3, ఈ5 రోడ్లను కలపనున్నారు. ఈ3 రోడ్డును రెండోదశ ల్యాండ్ పూలింగు ఏరియాకూ తీసుకెళతారు. ప్రస్తుతం రెండోదశ పూలింగు ఏరియాలో రోడ్ నెట్‌వర్కు ఏర్పాటు అనంతరం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పనిలో పనిగా మొత్తం ఔటర్‌రింగురోడ్డుకూ అనుసంధానం చేయనున్నారు.

2017లోనే కార్యాచరణ: రింగురోడ్ల మధ్యలో ప్లానింగు ఏర్పాటు చేయాలనే అంశంపై 2017 మార్చిలో జరిగిన సిఆర్‌డిఏ అథారిటీ సమావేశంలోనే నిర్ణయించారు. ఇన్నర్ రింగురోడ్డు, ఔటర్ రింగురోడ్డుకు మధ్యలో అభివృద్ధికి అవసరమైన ప్లానింగు చేయాలని అప్పట్లో సిఎం అధికారులకు సూచించారు. దీనికి వీలుగా రాజధాని చుట్టుపక్కల ఏడు ప్రాంతాలను పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలుగా గుర్తించారు. రింగురోడ్లను కూడా వాటిని దృష్టిలో పెట్టుకునే ప్లాను చేశారు. గుడివాడ, గుంటూరు, తెనాలి, సత్తెనపల్లి, కంచికచర్ల, కంకిపాడు, ఉయ్యూరు పరిసరాల్లో ప్రత్యేక అభివృద్ధి కేంద్రాలనూ ఏర్పాటు చేయాలనేది అప్పటి ప్రతిపాదన. ఎల(క్టానిక్ ఉత్పత్తుల కేంద్రంగా గుడివాడ, ఆహ్లాద, పర్యాటక ప్రాంతంగా తెనాలి, లాజిస్టిక్ కేంద్రంగా గన్నవరం ప్రాంతాలను అప్పట్లో ప్రతిపాదించారు. ప్రస్తుతం మాస్టర్‌ప్లాను రూపొందించాలనే మంత్రి ప్రకటన నేపథ్యంలో ఈ వ్యవహారం మరలా చర్చనీయాంశం అయింది.

# ముగ్గుల పోటీ నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు..

జగిత్యాల

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మల్లాపూర్ మండలంలోని గొర్రెపల్లి గ్రామంలో కంచి రాజం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన మహిళలకు విద్యార్థులకు బహుమతులు అందజేయగా జన్మదిన వేడుకలు జరుపుకున్న కంచి రాజంకు అభిమానులందరూ శుభాకాం క్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అబ్బూరి నాగరాజు, మేదరి శ్రీనివాస్, చింతకుంట సంజీవ్, తోకల గంగాధర్‌లు పాల్గొన్నారు.



# క్రీడాకారులను ప్రోత్సహిస్తాం : వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్

(జనగామ)

బచ్చన్నపేట మండల కేంద్రంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన క్రీడా సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని లక్ష్యంతో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్లనాగుల శ్వేతా వెంకన్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షులు లకవత్ ధన్వంతి లక్ష్మీనారాయణ, మార్కెట్ చైర్మన్ నల్లనాగుల శ్వేతా వెంకన్న, బచ్చన్నపేట ఎస్సై హమీద్, బచ్చన్నపేట సర్పంచ్ అల్వాల నర్సింగరావు పాల్గొని క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని, ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని,



ఓటమి రేపటి విజయానికి నాంది పలుకుతుందని తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ప్రతి మహిళకు చీరల పంపిణీ చేయడం జరిగిందని, కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతి క్లబ్ ఆర్గనైజర్ పోచంపల్లి శ్రీనివాస్, మండల యూత్ ఉపాధ్యక్షుడు పోచంపల్లి నాగరాజు, సమ్మేశ్వర్, మహేష్, అఖిల్ మాల, శివ, శ్రీకాంత్, అభి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత : సీఐ



(యాదాద్రి భువనగిరి)

రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని రామన్నపేట సీఐ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రామన్నపేట ప్రధాన రహదారి వెంట బైక్ ర్యాలీ చేపట్టి అనంతరం బస్టాండ్ లో వాహనదారులకు ట్రాఫిక్ నియమాలు పాటించాలని, అదే సమయంలో పాదాచారులు రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, మద్యం తాగి వాహనాలు నడపరాదని, లైసెన్స్, వాహనానికి ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్ద మృతి చెందితే కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సురేందర్, నాయకులు జెల్ల వెంకటేష్, ఎర్ర శేఖర్ గౌడ్, పోలీస్ సిబ్బంది కమలాకర్ వెంకటేశ్వర్లు ప్రశాంత్ రాఘవేంద్ర నరసింహ, సండ్ల కృష్ణమూర్తి, వర్కాల రవి దంతూరి నరసింహ లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# యువత, విద్యార్థులు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి

(నారాయణపేట)

యువత, విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలో రాణించాలని మొగ్ధంపూర్ సర్పంచ్ తిరుమలేష్ అన్నారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని మొగ్దుంపూర్‌లో సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను ప్రోత్సహించేందుకు ముగ్గుల పోటీలు యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించామని క్రీడా స్ఫూర్తి చాటేందుకు కృషి చేయాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని ఇస్తాయని, ప్రతీ ఒక్కరు ఆటఅబశ్రీశ్రీలు ఆడటం వల్ల ఆరోగ్యం బాగుపడుతుందన్నారు. క్రీడాకారులు తమ నైపుణ్యాలను



మెలకువలను ప్రదర్శించి ఉత్తమాట ప్రదర్శించాలని, గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు ప్రతీకారం..

## శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి



(హనుమకొండ)

రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ప్రజాపాలన కాదు ప్రతీకార పాలన కొనసాగిస్తుందని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి ధ్వజమెత్తారు. హనుమకొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయడం రేవంత్ రెడ్డి జేజమ్మ తరం కూడా కాదన్నారు. కేసీఆర్ పాలనా సౌలభ్యం కోసం జిల్లాల విభజనను చేశారని, జిల్లాలను మార్చే దుర్మార్గానికి ఒడిగడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. చేతనైతే ఇచ్చిన హామీ ప్రకారం సాగు సాయాన్ని పెంచి అందించాలని, ఏదో ఒక సాకుతో జిల్లాలలో మార్పులు జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

భూపాలపల్లి జిల్లాలో మార్పులు జరుగుతే తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని ఆయన హెచ్చరించారు. తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల కోసం పోరాడే పార్టీ బీఆర్ ఎస్ పార్టీ అని గుర్తుచేశారు. గతానికి అదనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యతగల ప్రభుత్వం దానికి భిన్నంగా జిల్లాలు కుదిస్తాం, మార్చేస్తాం అనే బాధ్యతారాహిత ప్రకటనలతో గందరగోళం సృష్టించి వారి ఉపాధి అవకాశాలను దెబ్బతీయడం అత్యంత దుర్మార్గమన్నారు. సమావేశంలో ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చింతం సదానందం, కార్పొరేటర్లు సోదా కిరణ్, నాయకులు ఇమ్మడి రాజు, శోభన్, సల్వాజీ రవీందర్ రావు, పానుగంటి శ్రీధర్, ఎండీ గౌస్‌ఖాన్, ఏలిషా, సౌరం రఘు, సంపతి రఘు, ఎస్కే మహిమూద్, తక్కళ్లపల్లి వినీల్ రావు, ఇమ్మడి స్నేహిత్, జేకే పాల్గొన్నారు.

# ఈఎల్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతంపేటలో ఐమాక్స్ లైట్ల ఏర్పాటు

(నల్గొండ)

గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామానికి ఈఎల్‌వీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేసిన ఐమాక్స్ లైట్లను సర్పంచ్ చందా శ్రీలత వెంకటేశం, ఉప సర్పంచ్ శారద జబ్బర్ లాల్ ఆధ్వర్యంలో బుధవారం ఫిటింగ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి పలు రకాలుగా సేవలు అందిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్‌కు తుల్జా భవాని మాత ఆశీస్సులతో పాటు ప్రజల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలఅబశ్రీశ్రీని వారు ఆకాంక్షించారు. గ్రామానికి అడగ్గానే లైట్లు పంపించిన ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్‌కు, డైరెక్టర్ అశోక్ కు గ్రామ పాలకవర్గం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఐతరాజు హనుమంతు, దండిగా శంకర్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారు : పూనెం సరోజ



(ఖమ్మం)

మణుగూరు ఫారెస్ట్ అధికారులు కళ్ళు ఉండి చూడలేని కబోదుల్లా వ్యవహరిస్తున్నారని రేణుక అక్షర మహిళా మండలి అధ్యక్షురాలు పూనెం సరోజ అన్నారు. కళ్ళముందే ఇసుకాసురులు అడవినంతా నాశనం చేస్తుంటే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అప్పుడేమో దగ్గరుండి వృక్షాలన్నిటిని నరికించి డబుల్ రోడ్డు వేయించిన అధికారులు అన్ని అనుమతులు ఉన్నాయంటూ దర్జాగా పనులకు సహకరించారన్నారు. కలెక్టర్ అనుమతులు ఇచ్చాడని ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కు నగదును సమకూర్చడం కోసం చెక్ పోస్టు కూడా ఏర్పాటు చేస్తున్నామని చెప్పారన్నారు. ఈ రోడ్లకు పలువురు నాయకులు, ప్రజలు తిరగబడడంతో ఫారెస్ట్ అధికారులు ఇప్పుడు ప్లేట్ ఫిరాయించారన్నారు.

మామూళ్ల మత్తులో ఫారెస్ట్ అధికారులు రోడ్లకు సహకరించారన్నారు. ఇప్పుడు ఎలాంటి అనుమతులు లేవంటూ ఆ రోడ్డు మార్గాన్ని జలపాతాలకు దారులంటూ గేట్లను ఏర్పాటు చేశారన్నారు. అప్పుడున్న కలెక్టర్ అనుమతులు ఇప్పుడు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. పేద ప్రజలకు సహకరించని అధికారులు భారీ మొత్తంలో నగదు తీసుకొని బడా బాబులకు సహకరించి సుమారు ఏడు కిలోమీటర్ల మేర అడవిని నరికి రోడ్లు నిర్మించడంలో ఇసుకాసురులకు అండగా నిలిచారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఇంత జరుగుతున్నా ఫారెస్ట్ ఉన్నతాధికారులు ఎందుకు స్పందించడం లేదో అర్థమవుతుందన్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మించడంలో భాగస్వామ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

### అందరి చూపు మోడీ వైపు...

ఉరుము ఉరిమి మంగళం మీద పడ్డ చందంగా మారింది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరిస్థితి.. రష్యా?ఉక్రెయిన్ యుద్ధం ముగించడానికి ఇప్పుడు భారత్‌పై బాంబు పేల్చాలని నిర్ణయించాడు. రష్యాను ఒప్పించడమో.. ఢీకొనడం సాధ్యం కాక.. రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్‌పై భారీగా టారిఫ్ విధించేందుకు పావులు కదుపుతున్నారు. రష్యాపై ఒత్తిడి పెంచేందుకు ద్వైపాక్షిక ఆంక్షల చట్టానికి అంగీకారం తెలిపారు. సెనేటర్ గ్రాహం ఎక్స్‌లో పోస్ట్ పెట్టి ట్రంప్‌తో చర్చలు జరిపినట్లు వెల్లడించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధించే అధికారాన్ని యుఎస్ పొందుతుంది. వచ్చే వారంలో ఓటింగ్ జరగనుంది. పుతిన్ యుద్ధానికి పరోక్షంగా నిధులు అందించడానికి భారత్, చైనా కారణమని ట్రంప్ ఆరోపణ. చైనా ప్రపంచంలోని అతిపెద్ద రష్యన్ చమురు కొనుగోలుదారు, భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ ఆంక్షలు రక్తపాతానికి మద్దతును కట్టడి చేస్తాయని గ్రాహం వాదన. గతేడాది భారత దిగుమతులపై 50 శాతం సుంకాలు విధించినట్లే ఇప్పుడు మరింత గట్టిగా ఉంటుంది. భారత్?అమెరికా మధ్య వాణిజ్య ఒప్పంద చర్చలు కొనసాగుతున్నాయి. ఈ బిల్లు ఆంక్షలు ఈ సంభాషణలను ప్రభావితం చేస్తాయి. భారత్ ఆర్థిక వ్యవస్థకు చమురు ధరల పెరుగుదల భారాన్ని మోపవచ్చు. పుతిన్ శాంతి మాటలు చెబుతూనే యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని గ్రాహం విమర్శించారు. ఈ ఆంక్షలు మాస్కో ఆదాయాలను తగ్గించి ఉక్రెయిన్‌కు మద్దతును బలోపేతం చేస్తాయి. బ్రెజిల్ వంటి ఇతర దేశాలు కూడా ఈ జాబితాలో చేరతాయి. ఈ చర్య భారత్‌కు రష్యన్ చమురు ఆధారాన్ని ప్రశ్నిస్తుంది. ప్రత్యామ్నాయ మూలాలు కనుగొనడం, యుఎస్‌తో దౌత్య చర్చలు జరపడం అవసరం. ట్రంప్ విధానం ఉక్రెయిన్ యుద్ధాన్ని త్వరగా ముగించే అవకాశాన్ని కల్పిస్తుంది. కానీ ఆర్థిక సవాళ్లను తెచ్చిపెడుతుంది. ట్రంప్ పాలిటిక్స్‌లో కొత్త మలుపు ఇది. వెనుజువెలాలోకి అమెరికా సైనికులను పంపించి ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో ఆ దేశంలోని చైనా, రష్యా డిఫెన్స్ సిస్టం విఫలమయ్యాయి. దీంతో అమెరికా ఆపరేషన్ విజయవంతమైంది. దీంతో ట్రంప్‌కు అహంకారం తలకెక్కింది. దీంతో క్యూబా, ఇరాన్, కొలంబియా, మెక్కికోతోపాటు భారత్‌ను టార్గెట్ చేశారు. వెనెజువెలాలో మదురో దంపతులను లక్ష్యంగా చేసుకుని యుఎస్ విజయవంతమైంది. రష్యా ఎస్?300, చైనా రాడార్లు అమెరికా చొరబాటును పసిగట్టలేకపోయాయి. దీంతో యుఎస్ ఆయుధాల ఆధిపత్యాన్ని నిరూపించింది. ఈ సంఘటన ఆయిల్ వనరులపై యుఎస్ ఆకాంక్షలను స్పష్టం చేస్తోంది. వెనుజువెలాలోని 303 బిలియన్ బ్యారెళ్ల క్రూడ్ ఆయిల్‌ను తరలించుకుపోవడానికి యుఎస్ కంపెనీలను ట్రంప్ ప్రోత్సహిస్తున్నారు. వెనుజువెలాలో విజయం తర్వాత ట్రంప్ ఇప్పుడు మరో ఐదు దేశాలపై ఫోకస్ పెట్టాడు. వెనెజువెలాపై ఆధారపడి ఉన్న క్యూబాను త్వరగా కూల్చివేస్తామని ట్రంప్ ప్రకటించారు. ఆయిల్ సరఫరాలు ఆగిపోతే ఇది సులభమవుతుందని వ్యూహం. అందుకే క్యూబాను ఫస్ట్ టార్గెట్ చేశారు. క్యూబాకు చెందిన మచాడో కూడా అమెరికాకు మద్దతు ఇస్తున్నారు. ఇరాన్‌పై మునుపటి దాడుల్లోనూ రష్యన్ టెక్నాలజీ విఫలమైంది. కొలంబియా అధ్యక్షుడు పెట్రోతో మాటల యుద్ధం ఉధృతమైంది. ఈ దేశాల్లో పాలన మార్పులు లక్ష్యంగా యుఎస్ ఒత్తిడి పెరుగుతోంది. కానీ పెట్రో బలంగా నిలబడ్డారు. ట్రంప్‌కు సవాల్ చేస్తున్నారు. అయితే కొలంబియా మెక్సికో పక్కనే ఉంది. అందుకే దానిని కూడా ఆక్రమించి చూస్తున్నారు. అమెరికా కోర్టుల ప్రకారం ఇవి తప్పు చేస్తున్నాయి కాబట్టి అక్కడి ప్రభుత్వాలను కూలుస్తామని ట్రంప్ అంటున్నారు. అక్రమ వలసలు, మాదకాలు కారణంగా మెక్సికోను లక్ష్యంగా చేసుకుని యుఎస్ సైనిక చర్యలు ఆలోచిస్తోంది. సరిహద్దు భద్రతకు ఇది ముఖ్యమని ట్రంప్ వాదన. నాటో సభ్య దేశమైన డెన్మార్క్ భూభాగం గ్రీన్‌లాండ్‌ను యుఎస్ కోరుతోంది. భద్రతా కారణాలతో ఈ డిమాండ్ ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఇది యుఎస్ ప్రభావాన్ని ఈ ప్రాంతంలో విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. ట్రంప్?మోదీ మధ్య వ్యాఖ్యలు ఉధృతమవుతున్నాయి. రష్యా నుంచి ఆయిల్ దిగుమతులు, టారిఫ్‌లు, మొక్కజొన్న వ్యాపారం విషయాల్లో యుఎస్ ఒత్తిడి పెరిగింది. షెల్ ఆయిల్ కొనుగోళ్లకు భారత్‌ను లక్ష్యంగా చేసుకుంటోంది. భారత్ మౌనంగా ఉండి స్వంత ఆస్థాను కాపాడుకుంటోంది. యుఎస్ ఆయుధాలు అమ్మకాలకు ఈ సంఘటనలు ప్రచారం చేస్తున్నాయి. మన దేశం మీద అమెరికా ఇప్పటికే 50% టారిఫ్ విధిస్తోంది. అప్పట్లో అమెరికా తీసుకున్న నిర్ణయం వల్ల భారత్ కుప్పకూలుతుందని అందరూ అనుకున్నారు. వారు అనుకున్నట్టుగానే స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోయింది. సంపద మొత్తం ఆవిరి అయిపోయింది. ఆ తర్వాత నెమ్మదిగా పరిస్థితి మారిపోయింది. అప్పటి మాదిరిగా కాకపోయినప్పటికీ, అమెరికాకు భారత్ నుంచి ఎగుమతులు వెళ్తూనే ఉన్నాయి. వాస్తవానికి ఈ సుంకాల వల్ల అమెరికాలో ఉన్న కస్టమర్ల మీదనే భారం ఎక్కువగా పడుతుంది. ట్రంప్ వల్ల అమెరికాలో ఆ వస్తువులను కొనేవారికి ఆర్థికంగా భారం పెరిగింది. ఈ ఎఫెక్ట్ ఇండియన్ కంపెనీల ఎగుమ తుల మీద కాస్త ప్రభావం చూపించింది. అంతేగాని ఆ సంస్థలు భారీగా నష్టాలు చవిచూసిన దాఖలాలు లేవు. ఇప్పుడు ట్రంప్ చెబుతున్నట్టుగా 500% సుంకాలు విధించినప్పటికీ ఎగుమతులు కాస్తలో కాస్త క్షీణిస్తాయి. అయితే అమెరికా మార్కెట్లో భారతదేశం నుంచి వచ్చే వస్తువుల ధర పెరుగుతుంది. అలాంటప్పుడు అమెరికా ప్రజలు వాటిని ఒకవేళ ఎంచుకుంటే.. పెద్దగా ఇబ్బంది ఉండదు. అలాంటప్పుడు ట్రంప్ వెయ్యి శాతం సుంకాలు విధించినప్పటికీ పెద్దగా ఇబ్బంది ఉండదు. కాకపోతే అమెరికాకు భారత్ నుంచి ఎగుమతి వస్తువుల పరిమాణం తగ్గుతుంది.. 500% సుంకాలు విధిస్తామని ట్రంప్ చెప్పగానే భారత్ లోని స్టాక్ మార్కెట్లు ఒత్తిడికి గురయ్యాయి. 8 లక్షల కోట్లు ఆవిరి అయిపోయాయి. వాస్తవానికి ఈ నష్టం స్టాక్ మార్కెట్ చరిత్రలో కొత్తది కాకపోయినప్పటికీ.. ట్రంప్ కు భయపడడం మొదలైతే.. అలానే ఇబ్బంది పెడుతూనే ఉంటాడు. కాస్త నిలబడి గట్టి సవాల్ విసిరితే అన్నీ మూసుకొని కూర్చుంటాడు. మోదీ తనను బతిమాడుతున్నాడని ట్రంప్ చెప్పుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మోదీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. మోదీ నిర్ణయంపైనే భారత ఎగుమతులు ఆధారపడి ఉంటాయి.

# పాలమూరుకు నీళ్లిచ్చిన కేసీఆరే గుర్తుంటరు!



కృష్ణా నదిపై ప్రాజెక్టుల నిర్మాణానికి నిజాం కాలంలోనే ప్రతిపాదనలు చేశారు. అప్పటి హైదరాబాద్ రాజ్యంలో భాగమైన ప్రస్తుత కర్ణాటకలో ఉన్న యాద్గిర్ జిల్లాలోని తంగిడి వద్ద భీమా ప్రాజెక్టు, ఆలమట్టి వద్ద అప్పర్ కృష్ణా ప్రాజెక్టు, తుంగభద్ర ఎడమకాలువ ద్వారా 174 టీఎం సీల నీళ్లు ఇవ్వాలని నిజాం రాజు రూపకల్పన చేశారు. తుంగభద్ర నది నుంచి తెలంగాణకు 65, మద్రాసుకు 65 టీఎంసీలకు సాగునీ ళ్లు తీసుకునేందుకు హైదరాబాద్ సంస్థానం, మద్రాసు ప్రభుత్వం మధ్య 1944లో ఒప్పందం జరిగింది. ఈ తరుణంలో నిజాం చేతిలో ఉన్న హైదరాబాద్ స్టేట్ భారతదేశంలో విలీనం కావడంతో నిజాం హయాంలో చేసుకున్న ఒప్పందాలు రద్దయ్యాయి. కేంద్రంలోని అప్పటి జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వమే దీనికి ప్రధాన కారణం. నిందలతో ఏం కోల్పోయినమో ప్రజలకు తెలిసిన రోజు, మీ ద్రోహం తెలిసిన రోజు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, నేతలకు రాజకీయ ఉరి వేస్తారు. ఏదేమైనా దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ మాత్రమే. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో 50 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యమున్న రిజర్వాయర్లు, 12.30 లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు కల్వకుర్తి ప్రాజెక్ట్ కింద 2 లక్షల ఎకరాలు, భీమా, జూరాల, కోయిల్‌సాగర్ కింద మరో రెండు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఇది కాంగ్రెస్ నాయకులకు కనపడకపోవచ్చు. కానీ, గత పదేండ్లలో పాలమూరు ప్రాజెక్టుల కింద పండిన పంటలే దీనికి సాక్ష్యం. అప్పర్ కృష్ణా, భీమా ప్రాజెక్టులు పూర్తయి ఉంటే నేడు ఈ దుస్థితి ఉండేది కాదు. ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత కృష్ణా నదిపై తెలంగాణ కోసం ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదు. ప్రస్తుత శ్రీశైలం ప్రాజెక్టు 86 కిలోమీటర్ల ఎగువన సిద్దేశ్వరం వద్ద నిర్మించాల్సి ఉంది. కొల్లాపూర్ దగ్గర్లోని మంచాలకట్ట సమీపంలో ఉన్న సిద్దేశ్వరం వద్ద ఆ ప్రాజెక్టు నిర్మించి ఉంటే తెలంగాణకు గ్రావిటీ ద్వారా నీళ్లు అందేవి. నందికొండ వద్ద నిర్మించాల్సిన నాగార్జున సాగర్‌ను 24 కిలోమీటర్ల దిగువన నిర్మించారు. తద్వారా ప్రాజెక్టుల ముంపును తెలంగాణకు మిగిల్చి, సాగు నీళ్లను ఆంధ్రాకు తరలించారు అప్పటి వలస పాలకులు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఏర్పాటు తర్వాత తెలంగాణ ప్రాంతానికి దక్కాల్సిన సాగునీటి హక్కుల కోసం ఆనాటి నాయకులు ట్రిబ్యునల్ ముందర సరిగ్గా వాదించలేకపోయారనేది ముమ్మాటికీ వాస్తవం. అప్పటికే సర్వే పూర్తి చేసుకున్న ప్రాజెక్టులను ట్రిబ్యునల్ ముందు ఉంచకపోగా, వాటి రద్దు కోసం అప్పటికే చేసుకున్న ఒప్పందాలను సైతం విలువలేని వాటిగా పరిగణించేటట్టు వ్యవహరించారు. తుంగభద్ర నది మీద కుడి, ఎడమ వైపులా గల కాలువల కోసం చెరో 65 టీఎంసీలు వాడుకోవాలని నిజాం హయాంలో ఒప్పందం జరిగింది. కానీ, ఆశ్చర్యకరంగా తుంగభద్ర కుడివైపు నీళ్లు కేటాయించుకొని 60 టీఎంసీలు వాడుకుంటూ, తుంగభద్రకు ఎడమ వైపున ఉన్న తెలంగాణకు కనీసం 6 టీఎంసీలు కూడా వాడుకోలేని పరిస్థితిని కల్పించారు. 1969లో బచావత్ ట్రిబ్యునల్ ఏర్పడింది. అయితే, ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు మూలంగా తెలంగాణ నష్టపోయిన సాగునీటి వివరాలను అప్పటి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ట్రిబ్యునల్‌కు వెల్లడించలేదు. నాటి వలస ప్రభుత్వం వివరాలు వెల్లడించకపోయినా, సాగునీళ్లు అడగకపోయినా తీవ్రంగా నష్టపోయిన పాలమూరును చూసి 17.80 టీఎంసీలు కేటాయిస్తున్నట్టు బచావత్ ప్రకటించారు. సాగర్ ప్రాజెక్టును కిందికి తీసుకుపోయింది చాలదన్నట్టు, ఆ తర్వాత శ్రీశైలం ప్రాజెక్టును నిర్మించినప్పుడు జల విద్యుత్తు ప్రాజెక్టు పేరిట తెలంగాణ ప్రజలను నమ్మించారు. తర్వాతి కాలంలో మద్రాసు నగరం దాహార్తి తీర్చే సాకుతో ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక వాటాల నుంచి ఐదు టీఎంసీల చొప్పున 15 టీఎంసీలను పోతిరెడ్డిపాడు వద్ద పొక్క పెట్టి మద్రాసుకు తరలించారు. మంచినీటి తరలింపు పేరుతో కాలువలు తవ్వుతున్న క్రమంలో 'కడప, నెల్లూరు జిల్లాల ప్రజల కండ్లముందు నుంచి, ఇండ్ల ముందు నుంచి నీళ్లు వెళుతున్నాయి. కరువుతో ఉన్నాం కాబట్టి, మా పంటల సాగుకు నీళ్లు ఇవ్వండని ప్రజలు అడుగుతున్నారు. కాబట్టి రెండు లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తాం' అని ప్రకటించారు. శ్రీశైలం ప్రాజెక్టు సాగునీళ్ల కోసం కాదని, విద్యుత్ అవసరాల కోసమేనని చెప్పి తెలంగాణ ప్రజలను ఏమార్చి మంచినీటి పేరుతో పోతిరెడ్డిపాడుకు పొక్కపెట్టి, తర్వాతి కాలంలో 11 వేల క్యూసెక్కులను 44 వేల క్యూసెక్కులకు పెంచి, అనంతరం దాన్ని మూడు పాయలు చేసి, కాలువ వెడల్పును 72 మీటర్లకు పెంచి ఏకంగా నదినే మలుపుకొనే విధంగా పోతిరెడ్డిపాడును తయారు చేసిన పాపం కాంగ్రెస్ పార్టీదే. ఆది నుంచి శ్రీశైలం నీళ్లను తెలంగాణకు దూరం చేసే కుట్రలు కొనసాగుతున్నాయి. దానిలో అంతర్భాగమే నీళ్లు లేని జూరాల నుంచి 'నీళ్లు తీసుకొని వెళ్లండి' అని చెప్పడం. 'మొదట అక్కడే నది పారుతుంది. అక్కడే ఎక్కువ మోటర్లు పెట్టండి' అన్న వాదనను ప్రచారం చేశారు. దీంతో నీళ్లు కావాలనుకొని ఆలోచించే కొందరు నిజమైన తెలంగాణ మేధావులను కూడా 'జూరాల నుంచి నీళ్లు తీసుకుంటే బాగుంటుండె కదా' అని మాట్లాడే పరిస్థితికి తీసుకువచ్చారు. ఒకవేళ జూరాల నుంచి గనుక పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి నీళ్లు ఎత్తిపోయాలనుకుంటే తీవ్ర ఇబ్బందులు తలెత్తేవి. జూరాలలో 20 నుంచి 25 రోజులు మాత్రమే సగటున భారీ వరద వస్తుంది. ఆ తర్వాత వచ్చే నీళ్లు కనీసం మోటర్లకు సరిపోవు. భీమా ఫేజ్-1, ఫేజ్-2 కింద రెండు లక్షల ఎకరాలు, నెట్టెంపాడు కింద 2 లక్షల ఎకరాలు, కోయిల్ సాగర్ కింద 46 వేల ఎకరాలు, జూరాల కుడి, ఎడమ కాలువలు కలిపి లక్ష 10 వేల ఎకరాలు.. ఇవన్నీ కలిపి దాదాపు 6 లక్షల ఎకరాలు జూరాల మీద ఆధారపడ్డయి. వీటికే సాగునీరు అందక క్రాప్ హాలిడే ప్రకటిస్తున్నారు. జూరాల మీద ఆధారపడ్డ భీమా, నెట్టెంపాడు ఎత్తిపోతల పంపులు 40 నుంచి 45 రోజులకు మించి నడవడం లేదు. ఆ పంపుల సామర్థం కూడా 16 నుంచి 20 మెగావాట్లు మాత్రమే. 16-20 మెగావాట్ల సామర్థ్యమున్న పంపులే 40 నుంచి 45 రోజులు మాత్రమే నడిస్తే.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని 145 మెగావాట్ల సామర్థం ఉన్న 10 పంపులకు సరిపడా నీళ్లు అందించగలిగే కెపాసిటీ జూరాలకు ఉందా? శ్రీశైలం బ్యాక్ వాటర్ మీద ఆధారపడి ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులు సగటున ఏడాదికి 230 నుంచి 240 రోజులు నడుస్తున్నాయి. జూరాల మీద ఆధారపడిన భీమా, నెట్టెంపాడు పంపులు కేవలం 40 నుంచి 45 రోజులే నడుస్తున్నాయి. మరి దీని ప్రకారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు సాగునీళ్లు ఎక్కడి నుంచి తీసుకోవాలి? ఈ నేపథ్యంలో 'పాలమూరు-రంగారెడ్డికి జూరాల నుంచి నీళ్లు తీసుకోవాలి. శ్రీశైలం నుంచి వద్దు' అనే చెప్పేవాళ్లు ఎవరైనా తెలంగాణ, పాలమూరు ద్రోహులే. జూరాల నుంచి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల చేపట్టి కోయిల్ కొండ దగ్గర, కొండాపురం వద్ద రెండు రిజర్వాయర్లను నిర్మిస్తామని కాంగ్రెస్ చెప్పింది. కోయిల్ కొండ వద్ద వెయ్యి ఎకరాలు, కొండాపురం వద్ద 500 ఎకరాల అటవీ భూమి ఉంది. కేంద్ర ప్రభుత్వం వీటికి కచ్చితంగా అటవీ అనుమతులు ఇవ్వదు. జూరాల నుంచి పాలమూరు ఎత్తిపోతల చేపడితే 2013 లెక్కల ప్రకారం 46 గ్రామాలు ముంపునకు గురికావడవే కాకుండా 85 వేల మంది ప్రజలు ప్రభావితమవుతారు. 77 వేల ఎకరాలు భూసేకరణ చేయాల్సి ఉంటుంది. తాజా లెక్కల ప్రకారం మూడు లక్షల మంది ప్రభావితమవుతారు. ఇంతా చేసి నిర్మిస్తే జూరాల నుంచి నీళ్లు వచ్చే పరిస్థితి ఉండదు. అంటే అది పూర్తిగా నిరర్థక ప్రాజెక్టుగా నిలిచిపోతుంది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నిర్మాణాల మూలంగా తెలంగాణ మునిగి ఆంధ్రాకు ప్రయోజనం చేకూరింది. ఈ ప్రాజెక్టుల వల్ల తెలంగాణలో కనీసం భూగర్భజలాలైనా పెరిగే అవకాశం లేకపోయింది. ఎందుకంటే అవి పూర్తిగా అటవీ ప్రాంతంలో ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో నిర్మించిన రిజర్వాయర్లలో 68 టీఎంసీల నీళ్లను నింపుకోవడం ద్వారా భౌగోళికంగా కొన్ని మైళ్ల దూరం భూగర్భజలాలు విస్తరించి మరో 10 నుంచి 12 లక్షల ఎకరాలకు సాగునీరందే అవకాశం ఉంటుంది. పదేండ్ల కేసీఆర్ శ్రమ ఫలితంగానే పాలమూరు పచ్చబడింది. పాలమూరు ప్రాజెక్టుతోనే ఈ ప్రాంత ముఖచిత్రం మారుతుంది. పాలమూరు పచ్చబడితే తమ ప్రాంతానికి నష్టమని భావిస్తున్న ఏపీ ప్రభుత్వం దానికి అడ్డం పడుతున్నది. అందుకు తెలంగాణలోని ఆంధ్రా బానిసలు వంతపాడుతున్నారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణ ఖర్చులు నేటి లెక్కల ప్రకారం రూ.80 వేల కోట్లుగా అంచనా వేసి, బీఆర్ఎస్ హయాంలో చేసిన పనులు రూ.27 వేల కోట్లు మాత్రమే అని అవివేకంగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.32 వేల కోట్ల పనులు పూర్తయ్యాయి. ప్రాజెక్టులో కీలకమైన పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు, విద్యుత్ స్టేషన్లు నిర్మించిన తర్వాత కాలువలకు టెండర్లు పిలిచాక కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. గద్దెనెక్కిన వెంటనే కాంగ్రెస్ సర్కార్ కాలువల టెండర్లను రద్దుచేసింది. తెలంగాణలో ప్రజలకు నీళ్లు, టీఎంసీలు,క్యూసెక్కులు, ప్రాజెక్టులు, సాగునీటి విలువ,అది మార్చే ప్రజలు, ప్రాంతాల ముఖచిత్రాల గురించి తెలియజెప్పింది కేసీఆరే. 'మనం ఎత్తున ఉన్నాం. మన ప్రాంతానికి నీళ్లు ఎలా వస్తాయి?' అని ఉమ్మడి రాష్ట్రంలో ఈ ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు మాట్లాడిన పరిస్థితి ఉండేది. ఆరు దశాబ్దాల పాలనలో ఏ ఒక్క కాంగ్రెస్ నేత పాలమూరు కోల్పోయిన సాగునీళ్ల గురించి ప్రజలకు తెలియజెప్పలేదు. ఒక్క జూరాల ప్రాజెక్టును ముందుపెట్టి దానినే 40 ఏండ్ల కాలంలో సాధించిన అతిగొప్ప ఘనకార్యంగా చాటుకున్నారు. కర్ణాటకకు పరిహారం ఇవ్వాల్సి ఉంటుందని దానిని కూడా ఎన్నడూ నిండా నింపలేదు. చివరకు కేసీఆర్ నిలదీసిన తర్వాతనే పరిహారం చెల్లించారు. నాటి నుంచి నేటి వరకు శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో తెలంగాణ వాళ్లు వేలు పెట్టకూడదనే ప్రయత్నాలే సాగుతున్నాయి. శ్రీశైలానికి అదనంగా తుంగభద్ర నుంచి 450 టీఎంసీల నీళ్లు వస్తాయి. జూరాల నుంచి నీళ్లు తీసుకోవాలని వాదించడమంటే పాలమూరుకు ద్రోహం చేయడమే. నిందలతో ఏం కోల్పోయినమో ప్రజలకు తెలిసిన రోజు, మీ ద్రోహం తెలిసిన రోజు ప్రజలు కాంగ్రెస్ పార్టీకి, నేతలకు రాజకీయ ఉరి వేస్తారు. ఏదేమైనా దక్షిణ తెలంగాణకు వరప్రదాయిని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్ మాత్రమే. ఎందుకంటే ఉమ్మడి జిల్లాలో 50 టీఎంసీల నీటినిల్వ సామర్థ్యమున్న రిజర్వాయర్లు, 12.30 లక్షల ఎకరాలకు సాగు నీటితో పాటు కల్వకుర్తి ప్రాజెక్ట్ కింద 2 లక్షల ఎకరాలు, భీమా, జూరాల, కోయిల్‌సాగర్ కింద మరో రెండు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ఇది ప్రస్తుత కాంగ్రెస్ నాయకులకు కనపడకపోవచ్చు. కానీ, గత పదేండ్లలో పాలమూరు ప్రాజెక్టుల కింద పండిన పంటల గణాంకాలే దీనికి సాక్ష్యం. అందుకే ఏ నాటికైనా ప్రజలకు కనిపించేది సాగు నీళ్లు తెచ్చిన కేసీఆర్ మాత్రమే.

# ప్రపంచ మనుగడకు సవాల్‌గా ట్రంప్ !

అమెరికా ఇతర దేశాల మీద దాడిచేస్తే...కారణాలు ఉంటాయి. కానీ ఇతర దేశాలు దాడి చేస్తే అది తప్పంటాడు. ఎవరి కారణాలు వారికి ఉంటాయి. అయితే ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక టెంపరితనం పెరిగింది. ప్రపంచంలో పెద్దన్న పాత్ర పోషించాలని చూస్తున్నారు. సామ్రాజ్యవాద విస్తరణ కాంక్ష కనిపిస్తోంది. తన కనుసన్నల్లో అన్ని దేశాలు నడవాలన్న నిరంకుశ రాజరికం కనిపిస్తోంది. ఏ దేశం కూడా తన కనుసన్నల్లోనే నడవాలను హుంకరిస్తున్నారు. పన్నుల టారిఫ్‌లతో విరుచుకు పడుతున్నారు. మొత్తంగా రెండురకాలుగా ట్రంప్ ప్రపంచాన్ని గిప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు. చెప్పినట్లు వింటే టారిఫ్‌ల బాదుడు ఉండదు. చెప్పినట్లు వినకుంటే టారిఫ్‌లు విధిస్తున్నారు. ఈ క్రమంలో చైనా,భారత్ వంటి దేశాలపై పన్నులతో విరుచుకు పడుతున్నారు. ఇలా కాని పక్షంలో బడిత ఉన్నోడిదే బర్రె అనే సామెతలో వెనిజువెలా లాంటి దేశాలపై సైనిక దాడికి దిగుతున్నాడు. ఇప్పటికే ఇరాన్, ఖతార్, సిరియాలపై విరుచుకుపడి బాంబులు వేశారు. వెనెజువెలాను తామే పాలిస్తామని చెప్పడం ఏరకమైన న్యాయం అన్నది అర్థం కాదు. ప్రపంచంలో సైనిక పాటవశక్తి ఉంటే ఏ దేశం మీదయినా దాడి చేయవచ్చా అన్న సందేహాలు వస్తున్నాయి. అలా అయితే మన దేశం నుంచి విడిపోయిన పాక్, బంగ్లా దేశ్‌లపై మనం కూడా దాడి చేసి భారత్‌లో కలిపేసుకుని, అఖండ భారత్ కలను సాకారం చేసుకోవచ్చు. అందుకు కొన్నిదేశాల మద్దతు అంటే, అమెరికాను ఎదిరించే దేశాల మద్దతు కూడగడితే చాలన్నమాట. భారత్‌లో ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న పాక్‌కు బుద్ధి చెప్పేందుకు దాడి చేస్తే అడ్డుకోవాలని ట్రంప్ చూశారు. తానే పాక్, భారత్ యుద్ధాన్ని ఆపానని అంటాడు. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం వద్దని పెత్తనం చెలాయిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దని అంటాడు. ఇలా ట్రంప్ తన తలకెక్కిన అహంకారంతో వ్యవహరి స్తున్నాడు. నిజానికి ఇప్పుడు భారత్ బంగ్లాదేశ్‌పై దాడి చేయాలి. అక్కడ మైనార్టీ హిందువులను ఊచకోత కోస్తున్నందుకు కలగచేసుకోవాలి. కానీ ఇది అంతర్జాతీయ సమస్య అవుతుంది. అదే అమెరికా వెనెజువెలాపై దాడిచేసి, ఆ దేశ అధ్యక్షుడిని పట్టుకుని వెళితే ఏ దేశం కూడా అడ్డుకోలేక పోయింది. దీంతో లాటిన్ అమెరికాలోని వెనిజులా ప్రస్తుతం ఒక విచిత్ర పరిస్థితిలో ఉంది. జనవరి మూడవ తేదీన రాజధాని కారకాస్ పై దాడి చేసిన అమెరికా నిద్రలో ఉన్న అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిసిలీ ఫ్లోర్స్‌ను కిడ్నాప్ చేసి ఏకంగా అ÷-ఎరికాకే తీసుకుపోయింది. నార్కో టెర్రరిస్టు అని అభియోగం మోపి న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టింది. తాను వెనిజులా అధ్యక్షుడినని, ఎలాంటి నేరం చేయలేదని మదురో కోర్టులో చెప్పాడు. తదుపరి ఏం జరుగుతుందో తెలియదు. తామే వెనిజులాను నడిపిస్తామని ట్రంప్ ప్రకటించాడు. అంతర్జాతీయ సంస్థలు ఏం చేస్తున్నాయో తెలియడం లేదు. ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తమకు సహకరించకపోతే మదురో కంటే ఎక్కువగా అనుభవించాల్సి వస్తుందని ట్రంప్ ఆమెను కూడా బెదిరించాడు. అయితే అంతర్జాతీయంగా వస్తున్న సమాచారం మేరకు . వెనిజులా లోని చమురు నిక్షేపాలను ఆక్రమించుకోవడం అమెరికా ఎత్తుగడగా ఉంది.. అమెరికా చర్యను ఐరాస ఖండించింది. మదురోను ఎలా పట్టుకున్నారు, అందుకు అనుసరించిన పద్ధతేమిటి అనే అంశాలు ఎలా ఉన్నా ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాల్సిన అవసరం మాత్రం ఉంది. దీనిపై ప్రపంచ దేశాలను కూడాగట్టాల్సి ఉంది. ముదురో అపహరణ సమయంలో జరిగిన ప్రతిఘటనలో 80 మంది మరణించారని, వారిలో 32 మంది క్యూబన్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్ కూడా యూదుల మారణకాండకు పాల్పడ్డాడు. నరమేధం సృష్టించాడు. గ్యాస్ ఛాంబర్‌లు పెట్టి లక్షల మందిని పొట్టన పెట్టుకున్నాడు. అనేక దేశాలను ఆక్రమించుకుంటూ పోయినా ప్రజాస్వామిక ముసుగు వేసుకున్న దేశాలేవీ అడ్డుకోలేదు. అప్పట్లో అమెరికా ఆయుధాలు కూడా అందించింది. అయితే రష్యా అధినేత స్టాలిన్ నాయకత్వంలో ప్రతిఘటించిన తరవాతనే హిట్లర్ ఆత్మహత్య చేసుకొని దిక్కులేని చావు చచ్చాడు. ఇండియాలో కూడా బ్రిటిషర్లు ఇలాగే వ్యవహరించాలరు. అంతకు ముందు మొగలులు కూడా దాడులు చేసి హిందూ ఆలయాలను ధ్వంసం చేసి ప్రజలను ఊచకోత కోశారు. మతమార్పిళ్లు చేశారు. తెలంగాణలో నైజాం నిరంకుశ రజాకార్లు కూడా ప్రజలను ఊచకోత కోశారు. ఇవన్నీ కూడా హిట్లర్‌ను మించి జరిగాయి. కాశ్మీర్‌లో మారణహోమం చూశాం. మతమార్పిళ్లు చూశాం. ఊచకోతలు చూశాం. ఇకపోతే దేశాన్ని ముక్కలు చేసేలా బ్రిటిషర్లు కుట్రలు చేశారు. అయితే ఇప్పుడు ప్రపంచ వ్యవస్థ మారంది. ఆధునిక ప్రపంచంలో ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా దాడిని, ఇప్పుడు వెనిజువెలాపై అమెరికా దాడిని చూస్తున్నాం. ఈ రెండు దేశాలు సైనికంగా బలంగా ఉండడంతో తమను ఎవరేమీ చేయలేరన్న ధీమాతో దాడులకు తెగించారు. చరిత్రను చూస్తే ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి ప్రపంచానికి నిత్యం నీతిసూత్రాలను బోధించే అమెరికా అడుగడుగునా వాటిని ఉల్లంఘించడం చూస్తున్నాం. తమ దారికి రాని వారిని ఏం చేస్తామో ఇది ప్రారంభం మాత్రమే అని మదురో అపహరణ తరువాత ట్రంప్ చెప్పాడంటే రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని దాడులు చూడాల్సి వస్తుందో, ప్రపంచానికి ఎలాంటి ముప్పురానుందో అన్నది ప్రపంచ దేశాలు ఆలోచించాల్సి ఉంది. ఇప్పుడు దోనాల్డ్ ట్రంప్ రూపంలో ఉన్న అమెరికన్ ఫాసిస్టు శక్తిని నిలువరించేది ఎవరనేదే కాలమే చెప్పాలి. తమ తదుపరి లక్ష్యం మెక్సికో, కొలంబియా, క్యూబా అని కూడా ట్రంప్ చెప్పాడు. ట్రంప్ సామ్రాజ్య విస్తరణ కాంక్ష వెనిజులా ఉదంతం స్పష్టం చేసింది. అంతకు ముందు డెన్మార్క్ స్వయంపాలిత గ్రీన్‌లాండ్ తమకు కావాలని చెప్పిన సంగతి తెలిసిందే. అది కూడా త్వరలోనే స్వాధీనం చేసుకునేదాకా వదిలేట్టుగా లేడు. కెనడాను కూడా ఇలాగే బెదరించాడు. ఏది కావాలంటే దాన్ని స్వాధీనం చేసుకొనే ట్రంప్ తరహా సామ్రాజ్యవాదం ముదరితే మళ్లీ బ్రిటిష్ తరహా సామ్రాజ్యం అమెరికా ప్రారంభిస్తుందా అన్న ఆందోళన కలుగుతోంది.

# కేంద్రం నుండి నిధుల వరద కొనసాగాలంటే..

## కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించండి

## కరీంనగర్ ప్రజలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ విజ్ఞప్తి

### కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరిన 51 డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు వేణు

### బండారు వేణుతోపాటు 50 మంది బీఆర్ఎస్ నాయకులు బీజేపీలో చేరిక



(కరీంనగర్)

కేంద్రం నుండి నిధుల వరద కొనసాగాలంటే కరీంనగర్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో అత్యధిక డివిజన్లలో బీజేపీ కార్పొరేటర్లను గెలిపించాలని కోరారు. తద్వారా కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కరీంనగర్ అభివృద్ధికి నయాపైసా ఖర్చు చేయలేదన్నారు. కాంగ్రెస్ తోపాటు అధికారంలోకి లేని బీఆర్ఎస్ కు ఓటేయడంవల్ల అభివృద్ధి ఆగిపోయే ప్రమాదముందని తెలిపారు.

ఈరోజు బీఆర్ఎస్ కు చెందిన 51వ డివిజన్ మాజీ కార్పొరేటర్ బండారు వేణు, మల్లంపహడ్ మాజీ సర్పంచ్ సాధినేని మునీందర్, 46వ డివిజన్ సీనియర్ నేతలు ప్రమోద్ రావు, గాజె శివరాం బీజేపీలో చేరారు. వీరితోపాటు వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు కరీంనగర్ ఎంపీ కార్యాలయానికి తరలివచ్చి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బండారు వేణు, సాధినేని మునీందర్, ప్రమోద్ రావు, గాజె శివరాం మాట్లాడుతూ కేంద్రం నుండి వచ్చిన నిధులవల్లే కరీంనగర్ కార్పొరేషన్ లో అభివృద్ధి జరిగిందని చెప్పారు.

బండి సంజయ్ కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులను తీసుకురావడంవల్లే అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు స్మార్ట్ సిటీ నిధులు, అమృత్ నిధులుసహా అనేక రూపాల్లో కేంద్రం నిధులు విడుదల చేస్తోందన్నారు. బీజేపీ సిద్ధాంతాలు, కరీంనగర్ అభివృద్ధికి బండి సంజయ్ చేస్తున్న క్రుషికి ఆకర్షితులై బిజెపిలో చేరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, నగర మాజీ మేయర్లు సునీల్ రావు, డి.శంకర్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, సీనియర్ నాయకులు కోమాల అంజనేయులు, వాసాల రమేశ్, బోయినిపల్లి ప్రవీణ్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు..

## పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణ రావు



(పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ పట్టణంలోని 2,3,4,5 వార్డుల్లో అర్హులైన 47 మంది లబ్దిదారుల ఇందిరమ్మ ఇండ్ల నూతన నిర్మాణాలకు స్థానిక నాయకులతో కలిసి పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు భూమి పూజ శంకుస్థాపనలు చేసి వారికి ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంతో పేదల సొంతింటి కళ సాకారం అవుతోందని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి మరింత అభివృద్ధి కార్యక్రమాలకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రమేష్, మున్సిపల్ అధికారులు, జిల్లా గ్రంథలయ సంస్థ చైర్మన్,అంతటి అనయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్, మినుపాల ప్రకాష్ రావు, డైరెక్టర్లు, మాజీ కౌన్సిలర్లు,బిరుదు సమత కృష్ణ, గాజుల రాజమల్లు, ఎండీ నిషాద్ రఫిక్ ,ఉట్ల వర ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు,వేగోళం అబ్బయ్య గౌడ్,దానాయక్ దామోదర్ రావు, సాయిరీ మహేందర్, శ్రీగిరి శ్రీనివాస్, పన్నాల రాములు, ముత్యాల రవీందర్, కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), కార్యకర్తలు, పలు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

# రజక సంఘం ఆధ్వర్యంలో సర్పంచులకు సన్మానం..



(ఆదిలాబాద్)

ఈరోజు అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రూయ్యడి గ్రామంలో గ్రామ రజక సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి నూతనంగా ఎన్నికైన సర్పంచ్ ఉడుగు రాకేష్. ఉప సర్పంచ్ వెంకటేష్ యాదవ్. వార్డ్ సభ్యులు ఎన్ అశోక్.గా రమాకాంత్. జీ ఉత్తం లను సన్మానించినారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి గోక గణేష్ రెడ్డి మాట్లాడుతూ రజకులు విశ్వాసానికి.నమ్మకానికి మారుపేరని ఈ గ్రామామనికి పూర్వం రజకుల గ్రామముగా పేరు ప్రతిష్టలు ఉండేవని అప్పటికి ఇప్పటికి గ్రామ అభివృద్ధిలో వారు సహకారం అందిస్తున్నారని గ్రామంలో 15 లక్షలతో రజక సంఘ భవనాన్ని నిర్మిస్తామని. 10 ఇందిరమ్మ ఇల్లు రజకులకు నిర్మిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎల్చాలా అయ్యన్న. మాజీ సర్పంచ్ పీ పోతారెడ్డి. సంజీవరెడ్డి. కాంగ్రెస్ నాయకులు మల్లేష్ యాదవ్. టి గంగారెడ్డి. రజక కుటుంబా సభ్యులు పాల్గొన్నారు

# కరీంనగర్‌లో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

## రవాణాశాఖ ఆధ్వర్యంలో మహిళలకు రంగవల్లుల పోటీలు






(కరీంనగర్)

జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు--2026లో భాగంగా కరీంనగర్ జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో ఆర్‌టీఏ కార్యాలయ ప్రాంగణంలో రోడ్డు భద్రత థీమ్‌తో మహిళలకు రంగవల్లుల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఆర్టీసీ కరీంనగర్ 1, 2 డిపోలఅబశ్రీశ్రీకు చెందిన మహిళలు, అలాగే ఆదర్శ, టీవీఎస్ సుజుకి తదితర షోరూమ్‌ల మహిళా ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేలా రంగవల్లుల్లో సందేశాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఏఎంవీఐలు స్రవంతి, హరిత నిర్వహించారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా డీటీసీపీ పురుషోత్తం, డీటీఓ శ్రీకాంత్ చక్రవర్తి, ఎంవీఐ రవికుమార్, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ నీలం సంపత్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఏఎంవీఐ సురేష్, ట్రాఫిక్ పార్క్ ట్రైనర్ సారికతో పాటు రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు ఈ నెల 31వ తేదీన బహుమతులు అందజేస్తామని అధికారులు తెలిపారు.

# భారీగా పెరిగిన మిర్చి ధరలు



గుంటూరు : గుంటూరు మిర్చి యార్డులో ధరలు భారీగా పెరిగాయి. యార్డుకు కొత్త సరుకు రావడం, ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గి దిగుబడులు కూడా తగ్గుతాయన్న సమాచారంతో వ్యాపారులు కొత్త సరుకు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. కర్నూలు, కడప, అనంతపురం నుంచి మిర్చి బస్తాలు వస్తున్నాయి. గత నెలలో క్వింటాళ్‌కు రూ.3 వేలు పెరగా ఈనెల మొదటి వారం నుంచి ధరలు మరింత పెరిగాయి. గత రెండు నెలల క్రితం ఉన్న ధరల కంటే కనీసం క్వింటాళ్‌కు రూ.5 వేల పెరిగాయి. మంగళవారం యార్డుకు 44,140 బస్తాలు సరుకు రాగా పాత నిల్వలతో కలిపి 50,136 బస్తాలు అమ్ముడుపోయాయి. ఇంకా 7,187 బస్తాలు నిల్వ ఉన్నాయి. నాన్ ఎసి కామన్ వెరైటీల్లో గరిష్ట ధర క్వింటాళ్ రూ.20 వేలు, కనిష్ట ధర రూ.13 వేలు లబిస్తుంది. తేజ, బాడిగ వెరయిటీ కూడా ఇదే ధరలు వస్తున్నాయి. ఆర్మూర్ రకం కనిష్ట ధర రూ.12 వేలు, గరిష్టంగా రూ.14 వేలు ధర వచ్చింది. గతేడాది సరుకు కోల్డ్ పస్టోరేజిల్లో నిల్వ ఉంది. ఈ సరుకు కూడా ధరలు పెరిగాయి. ఎసి వెరైటీల్లో 334 రకం కనిష్ట ధర రూ.12 వేలు, గరిష్ట ధర రూ.18,400, నెంబరు 5 రకం రూ.13 వేలు–18 వేలు, 341రకం రూ.13 వేలు–గరిష్టంగా రూ,.19 వేలు, సూపర్–10 రకం కనిష్ట ధర రూ.13,500, గరిష్ట ధర రూ.18,800 ధర లభించింది. ఎసి స్పెషల్ వెరైటీల్లో తేజ రూ.11 వేలు కనిష్ట ధర కాగా గరిష్ట ధర రూ.15 వేలు బాడిగ రూ.12 వేలు–17,500 ధర పలికింది. మొత్తంగా అన్ని రకాలకు ధరలు పెరిగాయని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి నవంబరు వరకు మిర్చి ధరలు ఏమాత్రం ఆశాజనకంగా లేక రైతులు నష్టపోయారు. ఈఏడాది మిర్చి సాగు కూడా భారీగా ధరలు పడిపోయాయి. దీంతో ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లాలో మిర్చి సాగు విస్తీర్ణం తగ్గింది. అంతేగాక సాగులో కూడా ఆలస్యమైంది. దీంతో ఫిబ్రవరి నుంచి గుంటూరు,పల్నాడు జిల్లాల నుంచి సరుకు రావడం ప్రారంభం అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఏటా 1.65 లక్షల ఎకరాల విస్తీర్ణంలో మిర్చి సాగు చేయాల్సి ఉండగా ఈ ఏడాది పల్నాడు జిల్లాలో 1.10 లక్షల ఎకరాలు, గుంటూరు జిల్లాలో 25 వేల ఎకరాలు మాత్రమే సాగు చేశారు. దాదాపు 30 వేల ఎకరాల్లో మిర్చి సాగు తగ్గింది. అంతేగాకుండా ఈ ఏడాది ఆదిలోనే మిర్చికి నల్లతామర, జెమినీ వైరస్ తెగుళ్లుసోకడం వల్ల పంట దిగుబడి ఏమేరకు చేతికి వస్తాయన్న అంశంపై రైతులు ఆందోళనలో ఉన్నారు. ఈనేపథ్యంలో రాయలసీమ నుంచి వస్తున్న కొత్త సరుకుతోపాటు కోల్డ్ స్టోరేజీల్లో ఉన్న మిర్చికి కూడా డిమాండ్ పెరిగింది. గతేడాది జనవరి నుంచి జూన్ వరకు గరిష్ట ధర రూ.13 వేలు కూడా దాటలేదు. ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి ధరలు ఆశాజనకంగా ఉన్నాయని అధికారులు తెలిపారు.

# కీలకాంశాలు విస్మరించ తగునా..!



వచ్చే సంవత్సరం జరిగే గోదావరి పుష్కరాల్లోగా అంటే మార్చి నెలకల్లా పోలవరం ప్రాజెక్టు జాతికి అంకితం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టు ను సందర్శించిన ఆయన మీడియాతో కొన్ని విషయాలు ప్రస్తావించారు కానీ ఇంకొన్ని కీలకాంశాలు విస్మరించడం విస్తుగొలుపుతోంది. సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు న్యాయమైన పరిహారం, పునరావాసం లభించని దుస్థితి ఇప్పటికీ కొనసాగడం అత్యంత విచారకరం.

రెండు దశల మాట నిర్వాసితులను ముంచడానికేనా..!: జలయజ్ఞంలో పోలవరం ప్రాజెక్టు ప్రతిపాదించినపుడు ఒకటే దశ. కానీ రాష్ట్ర విభజన చట్టం దాన్ని జాతీయ ప్రాజెక్టుగా పేర్కొనడంతో నిర్మాణ బాధ్యత కేంద్రానిదయ్యింది. నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం మొదటంతా కేవలం ఇరిగేషన్ కాంపొనెంట్ మాత్రమే బాధ్యతని, అంటే డ్యాం, ప్రధాన కాలువల నిర్మాణమేనని బుకాయించి, పునరావాస పునర్నిర్మాణ (ఆర్ అండ్ ఆర్) విషయాన్ని దాటవేస్తూ వచ్చింది. ఆ తరువాత ప్రాజెక్టును రెండు దశలుగా మార్చింది. డ్యాం 41.15 మీటర్ల ఎత్తు వరకు మొదటి దశగానూ, పూర్తి రిజర్వాయర్ మట్టం 45.72 మీటర్లు రెండోదశ అన్నారు. రాష్ట్రంలో అధికార పార్టీలు మారినా అప్పుడు, ఇప్పుడూ కేంద్రం కనుసన్నల్లో నడుచుకుంటున్నవే కనుక తలాడించాయి. అయితే, డ్యాం నిర్మాణం విషయంలో మాత్రం ఇది వర్తించదనీ, నిర్మాణం మొత్తం ఒకటిగానే పూర్తవుతుందని అప్పటి, ఇప్పటి ముఖ్యమంత్రులు చెబుతున్నారు. కాబట్టి నిర్వాసితులను పొమ్మనకుండా పొగబెట్టిన చందంగా రిజర్వాయర్‌లో నీరు నింపి వెళ్లగొట్టడానికే ఈ కుట్ర. అందుకనే దశలవారీ కాకుండా పూర్తి ఎత్తు వరకూ ఆర్ ఆండ్ ఆర్ మొదట పూర్తి చేశాకనే ప్రాజెక్టు నిర్మాణం అని నిర్వాసితులు ఘోష పెడుతున్నారు.

మొదటి దశకు సంబంధించిన 41.15 మీటర్ల పరిధిలోని నిర్వాసితులకు 2027 జనవరికల్లా పునరావాసం పూర్తి చేయనున్నట్లు బుధవారంనాడు ముఖ్యమంత్రి చెప్పారు. ఆ లెక్కలు చూసినా మొదటి దశకు సంబంధించిన ఆర్‌అండ్‌ఆర్ అమలు సైతం ఇంకా ఆమడదూరంలో వుందని తేటతెల్లమవుతోంది.

బాధితులను కలిసి పలకరించలేరా: ప్రాజెక్టు పూర్తయి అన్ని ప్రాంతాలకు నీరు అందించడం మునక ప్రాంతంలో 1.20 లక్షల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమైతేనే సాధ్యమవుతుంది. నిర్వాసితులకు భూమికి భూమిగానీ, ఇల్లు కట్టించడంగానీ, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలుగానీ జరగలేదు. కట్టించిన కాలనీల్లో వర్షం వస్తే ఇళ్లు కారుతున్నాయి. శ్మశానాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటివేవీ లేవు. 1986లో ఒకసారి, 2022లో మరోసారి వచ్చిన వరద ప్రభావ ప్రాంతాలను పరిశీలిస్తే మునక ప్రాంతంలో జరిగిన కాంటూరు సర్వే, తరువాత చేపట్టిన లైడార్ సర్వే ఏదీ వాస్తవాలను వెల్లడించడం లేదని రుజువైంది. తాజాగా నిర్వాసితుల బ్యాంకు ఎకౌంట్లలో జమచేస్తున్న పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ 2017కు ముందు అంచనాల ప్రకారం నిర్ణయించినవి కావడం గమనార్హం. 2017 తర్వాత డ్యామ్ అంచనాలు రెండుసార్లు సవరించారు కానీ నిర్వాసితులకు మాత్రం పాత ప్యాకేజిలే! పెళ్లయిన యువతులకు పునరావాస ప్యాకేజీ ఇవ్వడం లేదు. పురుషులతో సమానంగా క్ష్మలకు కూడా ప్యాకేజీ అమలు చేయాలి కదా! నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించినాఅది అమలుకు నోచుకోలేదు. ఈ ప్రభుత్వం అయినా ప్యాకేజీ తాజా ధరలకు అనుగుణంగా సవరించి పెంచి ఇస్తుందేమోనని నిర్వాసితులు ఆశిస్తున్నారు.కానీ ముఖ్యమంత్రి వాటి ఊసే ఎత్తుకోలేదు. పర్యటనలో డ్యామ్ నిర్మాణ పనులను ఆమూలాగ్రంపరిశీలించిన ఆయనముంపు ప్రాంతాలను, పునరావాస కాలనీలను కూడా సందర్శిస్తే బాగుండేది. అక్కడి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుంటే వాటిని సత్వరం పరిష్కరించడానికి, అనేక అవకతవకలను, సర్వేలో జరిగిన పొరపాట్లను సరిదిద్దడానికి అవకాశం వుండేదని ప్రాజెక్టు బాధితుల భావన.

కాంట్రాక్టర్లపై వారికీ వీరికీ ఎంత ప్రేమో..: డయాఫ్రం వాల్‌ను నాణ్యంగా నిర్మించనందున వరదలకు దెబ్బతిన్నది. విదేశీ నిపుణులు సైతం దీన్ని నిర్ధారించారు కానీ వారిచ్చిన నివేదికను బహిరంగపర్చలేదు. మరమ్మతులకు అదనంగా రూ.900 కోట్లు ఇచ్చారేతప్ప డయాఫ్రం వాల్ దెబ్బతినడానికి కారణమైన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. నిర్మాణంలో అవకతవకలను సరిచేయడానికి భవిష్యత్‌లో డ్యాం భద్రతకు అవసరమైన చర్యలను పారదర్శకంగా తీసుకోవాలి. కానీ డయాఫ్రం వాల్ దెబ్బతిన్నా కనిపెట్టలేకపోయారని, గత ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఆరేడు సంవత్సరాలు ఆలస్యం అవుతోందని సిఎం చంద్రబాబు చెప్పారే తప్ప అందుకు కారణమైన కాంట్రాక్టర్, ఆనాటి పనులు సర్టిఫై చేసిన ఉన్నతాధికారులు, గత ప్రభుత్వంలో ఈ అంశాల్లో నిర్ణయాలు చేసినవారిపై ఎలాంటి చర్యలనూ వెల్లడించలేదు.

వాస్తవమేమిటో చెప్పేస్తే సరి: రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రితో ఏకాంతంగా మాట్లాడి ఆపివేయించానని, అందువల్లే పనులు నిలిచిపోయాయని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 3వ తేదీన ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి ప్రకటనపై చంద్రబాబు నాయుడు స్పందించి వాస్తవం వెల్లడించాలని ప్రజలు కోరుకుంటున్నారు. విదేశీ పర్యటన నుండి వచ్చిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలోనే అన్ని విషయాలూ చెబుతానన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో జల వివాదాల గురించి ప్రస్తావించినా అప్పుడేమీ చెప్పలేదు. బుధవారంనాడు కూడా నీటి విషయంలో రాజకీయాలు చేయకూడదని, రాయలసీమ ఎత్తిపోతలపై ఇష్టానుసారం మాట్లాడుతున్నారని సిఎం అన్నారు. ఒక అబద్ధం చెబితే నిజం అయిపోతుందా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారే తప్ప తెలంగాణ సిఎంతో ఆర్ఎల్ఐ గురించి ఏం మాట్లాడారో వాస్తవం చెప్పేస్తే సరిపోతుంది కదా! ఇదీ అందరి ధర్మ సందేహం.

# మానసాదేవి అపురూప లక్ష్మి అమ్మవార్లకు మూడున్నర కేజీల వెండి తొడుగు బహూకరణ..



(కరీంనగర్)

మానసాదేవి అపురూప లక్ష్మి అమ్మవార్లకు మూడున్నర కేజీల వెండి తొడుగు బహూకరణ.. గన్నేరువరం మండలంలోని కాసింపేట సుప్రసిద్ధ స్వయంభు మానసా దేవి అపురూప లక్ష్మి అమ్మవార్లకు మూడున్నర కేజీల వెండి తొడుగును 11 లక్షల వ్యయంతో కరీంనగర్ విజయ మసాలా డ్రై ఫ్రూట్స్ యజమాని అక్కెనపల్లి రాజేష్ మేఘన దంపతులు బుధవారం ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏలేటి చంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు పెండ్యాల అమర్నాథ్ శర్మ వేదమంత్రాలతో వెండి కవచాలకు ప్రత్యేక అభిషేకం పూజలు నిర్వహించి అమ్మవార్లకు అలంకరించారు.

**అమ్మవారి ఆశీస్సులతో పుత్ర సంతానం కలగడంతో..** ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు ఏలేటి చంద్రారెడ్డి మాట్లాడుతూ.. అక్కెనపల్లి రాజేష్ కుటుంబ సభ్యులు మానసాదేవి ఆలయానికి పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయాన్ని అందజేస్తూ ఆలయ అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్నారని వారికి అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయని అన్నారు. అమ్మవారి ఆశీస్సులతో పుత్ర సంతానం కలగడంతో మొక్కు చెల్లించుకున్నారని తెలిపారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాజేష్ కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్కెనపల్లి శ్రీనివాస్ సరస్వతి, విజయ లిఖిత పరిణయ, చంద్రశేఖర్, రసజ్ఞ, కుతిక్ష, ఆలయ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హుజురాబాద్ విద్యార్థుల జైత్రయాత్ర..



(కరీంనగర్)

హనుమకొండలోని గిరిజన భవన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే ఛాంపియన్షిప్-2026 పోటీల్లో హుజురాబాద్‌కు చెందిన గ్లోబల్ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారు. అకాడమీ జిల్లా అధ్యక్షులు, మాస్టర్ ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 14 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొని ఏకంగా 12 బంగారు పతకాలు, 2 వెండి పతకాలను కైవసం చేసుకున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి కరాటే క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను బుధవారం హుజురాబాద్‌లో ఘనంగా సన్మానించారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బండ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో అమ్మాయిలకు కరాటే వంటి ఆత్మరక్షణ విద్యలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

విద్యార్థులు గంజాయి, డ్రగ్స్ వంటి దురలవాట్లకు దూరంగా ఉండి, క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని, క్రమశిక్షణను పెంపొందించుకోవాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. షాడో షోటోకాన్ మార్షల్ ఆర్ట్స్ ఆర్గనైజర్ రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వేల్పుల రత్నం, సదానందం, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, మాజీ ఎంపీపీ వెంకట రాజం, ఖలీద్ హుస్సేన్, రిటైర్డ్ పీఈటి సారయ్య, ఉప్పు శ్రీనివాస్ పటేల్, కాంగ్రెస్ నాయకులు కొలిపాక సమ్మయ్య, మధు, నాగమణి, లక్ష్మణమూర్తి, ఎండి సలీం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో రాణించి హుజురాబాద్ పేరును నిలబెట్టిన కరాటే మాస్టర్ ఎస్కే జలీల్‌ను, విద్యార్థులను ఈ సందర్భంగా అందరూ ప్రత్యేకంగా అభినందించారు.

# ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలి : ఎస్ఐ



(జగిత్యాల)

ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, అలాగే కారు నడిపేవారు సీటు బెల్ట్ తప్పక ధరించాలని "అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ పి. ఉదయ్ కుమార్ అన్నారు. వెల్గటూర్ మండల కేంద్రంలోని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు వారసంతలో రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన "అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు హెల్మెట్ తోపాటు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదని, అధిక వేగం, ట్రిపుల్ రైడింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం చేయకూడదని వివరించారు. రోడ్డు నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు తమ కుటుంబ సభ్యుల తోపాటు ఇతర రోడ్డు వినియోగదారుల ప్రాణాలను కాపాడుకోవచ్చని, ప్రమాదాల నివారణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అందరూ విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ, రోడ్డు భద్రతను సామూహిక బాధ్యతగా తీసుకుని "అరైవ్ అలైవ్ లక్ష్యాన్ని సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌ల ఫోరమ్ మండల అధ్యక్షుడు గంద్ర ప్రతాప్ రావు, మాజీ సర్పంచ్ మెరుగు మురళీ గౌడ్, బీసీ సెల్ మండల అధ్యక్షుడు బందెల ఉదయ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ గంద్ర శ్రీకాంత్ రావు, మాజీ ఉప సర్పంచ్ గుండాటి సందీప్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జూపాక ప్రవీణ్, కస్తూరి మల్లేష్, కస్తూరి తిరుమల్లేష్, ఎనగందుల నరేష్, ఎర్రోళ్ల సతీష్, ఆటో యూనియన్ సభ్యులు, వ్యాపారులు, కొనుగోలుదారులు, వాహనదారులు, గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కటికనపల్లి గ్రామంలో మహిళలకు ముగ్గుల పోటీలు..



(పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం కటికనపల్లి గ్రామంలో స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వచ్చి ఈ పోటీలలో పాల్గొన్నారు. తీరొక్క ముగ్గులు అందరినీ అలరించాయి. కొత్తూరు గ్రామ సర్పంచ్ భూక్య సంగీత న్యాయ నిర్ణేతగా వ్యవహరించి మహిళలు ఆకర్షణీయంగా వేసిన ముగ్గులను ఎంపిక చేశారు. అనంతరం విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను స్థానిక సర్పంచ్ చేపూరి లచ్చయ్య ప్రదానం చేశారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ కన్సోలేషన్ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచి నోనగిరి అజయ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ధర్మారంలో ఘనంగా గోదా రంగనాథుడి కళ్యాణోత్సవం..

(పెద్దపల్లి)

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని శ్రీ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆలయ కమిటీ చైర్మన్ పద్మజ-జితేందర్ రావు ఆధ్వర్యంలో గోదారంగనాథుడి కళ్యాణాన్ని నిర్వహించారు. నెల రోజులపాటు ఆలయంలో భక్తులు ప్రతీరోజు ఉదయం విష్ణు పారాయణం చదివారు. ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గోదా రంగనాథుడి కళ్యాణోత్సవం, ధనుర్మాసం విశిష్టత గురించి ఆలయ కమిటీ చైర్మన్ భక్తులకు వివరించారు.

అనంతరం గోదా రంగనాధుడికి సాంప్రదాయబద్ధంగా ఆలయ అర్చకులు కళ్యాణతంతు పూర్తి చేశారు. ఈ ఉత్సవంలో ఆలయ ధర్మకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ భూతాన్ని తరుముదాం..

(హైదరాబాద్)

భూతంలా ప్లాస్టిక్ పర్యావరణాన్ని ధ్వంసం చేస్తోంది. నిషేధాజ్ఞలున్నా విచ్చలవిడిగా వినియోగం పెరుగుతోంది. ఉత్పత్తి లేకుండా చేయడంలో అధికార యంత్రాంగాలు విఫలమవుతున్నాయి. గ్రేటర్‌లో రోజూ 8వేల టన్నుల చెత్త పోగవుతుండగా అందులో 14శాతం ప్లాస్టిక్ వ్యర్థాలే. ప్లాస్టిక్ రహితనగరంగా మార్చాలంటే 'సిక్కిం' తరహా కఠిన విధానాలు అవలంబించాలని నిపుణులు సూచిస్తున్నారు.

అక్కడ ఇలా..: పర్యావరణ పరిరక్షణలో దేశంలోనే ముందున్న రాష్ట్రం సిక్కిం. ప్లాస్టిక్ వ్యర్థాలు భారీవర్షాల సమయంలో డ్రైన్లను అడ్డుకోవడంతో అక్కడ కొండచరియలు విరిగిపడి అనేకమంది మరణించారు. ఈ నేపథ్యంలోనే 1998లో తొలిసారిగా డిస్పోజబుల్ ప్లాస్టిక్‌క్యారీ బ్యాగ్‌లు (50 మైక్రాన్ల కంటే తక్కువ ఉన్నవి) నిషేధించింది. 2016లో థర్మకోల్ ప్లేట్లు, డిస్పోజబుల్ ఉత్పత్తులపై పూర్తి నిషేధం అమలు చేసింది. ప్రభుత్వ కార్యాలయాలు, కార్యక్రమాల్లో ప్యాకేజ్డ్ డ్రింకింగ్ నీటిని నిషేధించడంతో పాటు 2022 జనవరి నుంచి 2 లీటర్లు అంతకంటే తక్కువ సామర్థ్యంఉన్న ప్లాస్టిక్ నీటిసీసాల తయారీ, దిగుమతి, అమ్మకం, వినియోగంపై ఆంక్షలు విధించింది. 2022 డిసెంబరు 31నుంచి 120 మైక్రాన్లకంటే తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లపై నిషేధం విధించింది. ప్రకటనలే పరిమితం చేయకుండా మున్సిపల్ స్క్వాడ్‌లు, కాలుష్య నియంత్రణ మండలి బృందాలు నిరంతరం తనిఖీలుచేస్తున్నాయి. ఉల్లంఘించిన వారిపై జరిమానా విధిస్తున్నారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలతో చిన్నారులకు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.

**నగరంలో పరిస్థితి ఇదీ...**

నగరంలోని ప్లాస్టిక్ కవర్ల తయారీ సంస్థలు - 300(సుమారు).. ప్రధాన రకాలు-సింగిల్ యూజ్ ప్లాస్టిక్



మూసీ నది చుట్టూ 10 టన్నులకుపైగా ప్లాస్టిక్ వ్యర్థాలు డంప్ అవుతున్నాయి. ఫ్లోటింగ్ ట్రాష్ బారియర్లున్నా చాలా నదిలోకి చేరుతున్నాయి. ఇవి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటూ వర్షాకాలం వరదలకు కారణమవుతున్నాయి.

హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్ చెరువులు ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయి. నగరంలోని వేర్వేరు చెరువుల్లో లేక్ క్లీనప్ డ్రైవ్‌లు చేపడుతుండగా 70శాతం వ్యర్థాలు ప్లాస్టిక్‌వే ఉంటున్నాయి.

మైక్రోప్లాస్టిక్ భూమి, నీటిని కలుషితం చేస్తున్నాయి. జంతువులు ప్లాస్టిక్‌ను తిని మరణిస్తున్నాయి.

**ప్రత్యామ్నాయాలు ఇవీ..**

హోటళ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఫిల్టర్ వాటర్ స్టేషన్లు, రీయూజబుల్ బాటిళ్లు (బాంబూ, స్టీల్, సీసంవాటికి బాటిళ్లకు ప్రోత్సాహం)

జనపనార, కాగితం, వస్త్రంతో చేసిన సంచుల వినియోగం పెంచాలి.

కంపోస్టబుల్ బ్యాగ్‌లు వాడాలి.

హోటళ్లలో విస్తారాకులు, అరిటాకులు ఉపయోగించాలి.

బాంబూప్లేట్లు, కప్పులు, ఎడిబుల్ వస్తువుల వినియోగం పెంచాలి.

# ఒంటరితనంతో బాధపడుతున్నారా.. అయితే ఇలా చేయండి

(హైదరాబాద్)

కొంత మంది ఒంటరిగా మిగిలిపోయామని బాధపడుతుంటారు. తమకంటూ ఎవరూ లేరని, చుట్టూ ఉన్నవారు కూడా దూరం చేస్తున్నారని భావిస్తారు. నిజానికి మన అలవాట్లు, ఆలోచనా తీరు, మనస్తత్వమే మనుషుల్ని మనకు దూరం చేస్తాయని మానసిక నిపుణులు చెబుతున్నారు. ఒంటరినని భావించే వారిలో ఈ లక్షణాలు ఉంటాయంటున్నారు.

ఎవరితోనూ చెప్పరు : చాలా మంది తమ భావోద్వేగాలను లోలోపలే దాచేసుకుంటారు. ఎవరితోనూ పంచుకోవాలని అనుకోరు. కనీసం తమను ఎంతగానో ప్రేమించే కుటుంబసభ్యులు, స్నేహితులతోనూ ఏమీ చెప్పుకోరు. ఇలా చేస్తే ఎదుటివారు 'నాపై ఇష్టం/నమ్మకం లేదేమో, అందుకే ఏమీ చెప్పట్లేదు' అనుకుంటారు. అలాగే క్రమంగా దూరమవుతారు.

ఎవరూ నన్ను అర్థం చేసుకోవడం లేదు : 'నన్ను, నా ఫీలింగ్స్?ను అసలు పట్టించుకోరు, నేను లేకపోయినా ఎవరికీ నష్టం లేదు' అని అనుకుంటారు. ప్రతి సారి మనం చెప్పకుండా ఎవరూ అర్థం చేసుకోలేకపోవచ్చు. మనం కోరుకున్నట్లు స్పందించలేకపోవచ్చు. దీంతో నిరాశ, నిస్పృహలే ఎదురవుతాయి. బంధాల మధ్య అపార్థాలు మొదలవుతాయి. ఎవరూ నన్ను అర్థం చేసుకోలేదని, ఒంటరినైపోయానని ఫీలవుతారు.

గొడవయితే మౌనం : బంధాల్లో కొన్నిసార్లు అసౌకర్యం తప్పదు. మొహమాటాలు, గొడవలు, భావోద్వేగాల్లో వైరుధ్యం సహజమే. అయితే, ఒంటరిగా మిగిలిపోయేవారు వీటిని ఎదుర్కోవడానికి భయపడతారు. మాట్లాడి పరిష్కరించుకునే అవకాశం ఉన్నా మౌనంగా ఉండిపోతారు. దీంతో బంధాలు బీటలువారడం, క్రమంగా దూరం పెరగడం జరుగుతాయి.

ఎదుటి వారూ ముఖ్యమే : ఎవరైనా ఒక విషయం చెప్పినప్పుడు నాకూ అలాగే జరిగింది అంటూ గతంలోకి వెళ్లి తన గురించే చెప్పుకుంటారు. ఇలా చేయడం వల్ల ఎదుటివాళ్లు తాము చెప్పింది వినిపించుకోలేదని భావిస్తారు. తమ మాటలకు గౌరవం ఇవ్వట్లేదని అనుకుంటారు. దీంతో మాట్లాడటం మానేస్తారు.

అతిగా ఆలోచనలు : ఎవరైనా ఏదైనా మాట అన్నా, మెసేజ్ ద్వారా స్పందించినా, వాటి గురించే అతిగా ఆలోచించడం, ఆ మాట వెనుక ఉద్దేశ్యం ఏంటని విశ్లేషించడం, ప్రతికూల ఫలితాలనే ఊహించుకోవడం చేస్తుంటారు. దీని వల్ల అనుమానాలు పెరిగి, బంధాలు దెబ్బతింటాయి. ఏమీ జరగకపోయినా ఏదో జరిగిపోయిందన్నట్లుగా భావించి ఎదుటివారిని దూరం చేసుకుంటారు.

కారణం ఏదైనా అబద్ధం వద్దు : కొంతమంది ఎదుటివారు బాధపడకూడదని, గొడవలు జరగకూడదని నిజాలు దాచేసి మౌనంగా ఉండిపోతారు. మంచి కోసమే చేస్తున్నామని అనుకుంటారు. అయితే, చెప్పనంత మాత్రాన అవి కనుమరుగవవు. పైగా మనిషిలో అసహనాన్ని పెంచుతాయి. ప్రశాంతతనివ్వవు. మాట్లాడితే వచ్చే గొడవల కన్నా ఈ మౌనం బంధాల మధ్య మరింత దూరాన్ని సృష్టిస్తుంది.



నా తలరాత ఇంతే : కొన్ని నమ్మకాలు మనిషి ప్రవర్తనను మార్చేస్తాయి. 'నేను ఎప్పుడూ ఒంటరిగా మిగిలిపోతాను'అనే నమ్మకం కూడా ఆ కోవలోకే వస్తుంది. కొందరు నా తలరాత ఇంతే అనుకుంటూ ఎవరితోనూ కలవరు. ఎదుటివాళ్లు దూరం పెడతారమోనని, ముందుగానే వీరే దూరంగా ఉండిపోతారు.

ఏం చేయాలి : పైన పేర్కొన్నవన్నీ ఎదుటి వ్యక్తుల వల్ల వచ్చిన ఒంటరితనం కాదు తప్పుడు భావనలు, అలవాట్లతో చేజేతులా తెచ్చుకునే పరిస్థితి. దీనిపై అవగాహన పెంచుకొని, జీవనశైలి, అలవాట్లలో మార్పులు చేసుకుంటే పరిస్థితులు మారే అవకాశాలున్నాయి.

మొదట తమ గురించి ఎదుటివాళ్లు ఏం అనుకుంటారనే ఆలోచనను పక్కన పెట్టాలి. లోపలి భావాలను నమ్మకమైన వ్యక్తులకు తెలియజేయాలి. స్నేహితుల్ని, కుటుంబసభ్యుల్ని పలకరించి మాట్లాడాలి. వారితో మాట్లాడితే ఒంటరిననే ఆలోచన రాదు.

సరిపడా నిద్ర, పౌష్టికాహారం, వ్యాయామం రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలి. ఇవీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దృఢంగా ఉంచుతాయి. స్నేహితులతో కలిసి జిమ్‌కు, వాకింగ్‌కు వెళ్తే బంధం మరింత పెరుగుతుంది.

ఖాళీగా ఉంటే ఒంటరిననే భావనే వస్తుంది. ఆ అవకాశం రానివ్వొద్దు. అలాంటి సమయంలో నచ్చిన పుస్తకం చదవడం, సంగీతం వినడం, గార్డెనింగ్ ఇలా ఏదో ఒక పనిలో నిమగ్నమైతే సరి.

నలుగురి మధ్య ఉండటం, నలుగురితో మాట్లాడటం అలవాటు చేసుకోవాలి. క్లబ్, క్లాస్, వాలంటీర్‌గా పనిచేయడం, ఆన్‌లైన్ కమ్యూనిటీ యాక్టివిటీస్‌లో చురుగ్గా పాల్గొనాలి. అభిప్రాయాలను ఏ బెరుకు లేకుండా చెప్పాలి.

కుటుంబసభ్యులు, స్నేహితులతో కలిసి భోజనం చేయడం, షికారుకు వెళ్లడం వంటివి చేస్తుండాలి. అప్పుడు, వీళ్లంతా నా కోసం ఉన్నారనే భావన కలుగుతుంది. ఒంటరిననే ఆలోచన దూరమవుతుంది.

అవసరమైతే మానసిక వైద్యులను సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలి. మానసిక చికిత్స తీసుకోవడం అనేది బలహీనత కాదు. మంచి భవిష్యత్తు కోసం తీసుకునే ధైర్యవంతమైన నిర్ణయంగా భావించాలి.

# విదురుడు చెప్పిన నియమాలు..

మహాభారతంలో ధృతరాష్ట్రుడి సవతి కొడుకే విదురుడు. ఈయన గొప్ప జ్ఞాని. దూర దృష్టి కలిగిన వ్యక్తి. దాని కారణంగానే కొన్ని సమస్యలను ముందుగానే ఊహించేవాడు. కురుక్షేత్ర యుద్ధం కూడా చాలా ఘోరంగా ఉంటుందని ధృతరాష్ట్రుడిని హెచ్చరించాడు. విదురుడు కురుక్షేత్ర యుద్ధంలో పాండవుల విజయంలో ముఖ్యపాత్ర పోషించిన శ్రీకృష్ణుడితో పాటు విదురుడి సలహాలు కూడా ఉన్నాయి. పాండవులు విదురుడి మాటలకు ఎంతో గౌరవం ఇచ్చేవారు. భీష్ముడు కూడా విదురుడి సలహాలను తీసుకునేవాడు. అయితే విదురుడు ప్రజలకు సహాయం చేయడం గురించి కొన్ని ప్రత్యేక విషయాలను కూడా చెప్పాడు. అవేంటో ఇప్పుడు శిశువుతెలుసుకుందాం. విదురుడు చెప్పిన దాని ప్రకారం మీ సంతానంకు కానీ మీరు ఇష్టపడే వ్యక్తుల క్షేమ కోరుకుంటున్నారో వారికి మంచి తో పాటు చెడు గురించి కూడా హెచ్చరించాలని విదురుడు తెలిపారు. ఇలాంటి విషయాలు చెప్పడంలో ఆలస్యం చేయకూడదని, వారు అడిగే వరకు వేచి ఉండకూడదు అని, చెడు గురించి హెచ్చరించాలి అని విదురుడు తెలిపారు. చెడు గురించి హెచ్చరించిన వారు వినిపించుకోకపోతే అది వారి నిర్ణయానికే వదిలేయాలి అని విదురుడు అంటాడు. ఇలా చేయడం ద్వారా మీరు అన్ని విషయాలతో పాటు తప్పు విషయాలపై కూడా వారికి అవగాహన కలిగించినట్లయితే వారు మీపై సంతృప్తిగా ఉంటారు. ఇప్పుడు ఆ వ్యక్తి తన మంచి చెడ్డలను చూసి తన నిర్ణయం తీసుకోవచ్చు. ఇలా చేయడం వలన రెండు లాభాలు ఉంటాయి. ముందుగా అన్నీ తెలిసిన హెచ్చరించలేదన్న అపరాధ భావం కలగదు. అంతేకాకుండా ఆ వ్యక్తి కూడా భవిష్యత్తులో మీరు తన శ్రేయోభిలాషి అని నమ్ముతారు. విదురుడు విధానాలే కాకుండా అతని జీవితం అంతా కూడా అదే సందేశాన్ని ఇస్తున్నట్లు అనిపిస్తుంది. విదురుడు స్వయంగా తన విధానాలను ధృతరాష్ట్రుడికి చెప్పాడు. యువకుడైన దుర్యోధనుడు ధర్మానికి వ్యతిరేకంగా ఉన్నాడని అతనికి ఫలితం అలానే ఉంటుందని సూచించాడు. అయినా దుర్యోధనుడు విదురుడి విధానాలను అస్సలు అంగీకరించలేదు. కానీ దాని ఫలితం కౌరవుల నాశనానికి కారణం అయింది. అవమానం నిర్లక్ష్యం ఉన్నప్పటికీ విదురుడు తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. కాబట్టి దగ్గరి వారికి అడగకుండానే సలహాలు ఇవ్వమని విదుర నీతి తెలుపుతుంది.

# దేశానికి అవసరమైన మందు సార్వజనీన ఆరోగ్య సంరక్షణ

కొత్త సంవత్సరం రాకతో మనలో కొత్త ఆశలు మోసులెత్తుతాయి. మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్న ఆకాంక్షలు, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మెరుగైన జీవితాలు సాధ్యపడతాయన్న ఆశలు కలుగుతాయి. నూతన సంవత్సరం సందర్భంగా ఎంతో ఆశావహంగా గడుపుదామనుకుంటాంగానీ మన చుట్టూ నిరాశాజనకమైన వాతావరణం అలముకుని ఉంది. ప్రపంచ పర్యావరణంలో ప్రతికూల మార్పులు, సాయుధ ఘర్షణలు, వాణిజ్య యుద్ధాలు, పొంచి ఉన్న అంటువ్యాధులు, తీవ్రతరమవుతున్న ఆర్థిక అసమానతలు, సంకుచిత దేశభక్తి మాటున చెలరేగుతున్న విద్వేషపు జాతి హననాలు, వర్ణ వివక్ష వంటి అనేక సమస్యలు, సంక్షోభాల నడుమ కూడా మన చుట్టూ ఉన్న ప్రపంచం శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్న ఆశాభావం జనాల్లో నెలకొని ఉన్నది.

ఆయురారోగ్యాలతో వర్ధిల్లమని మనం దీవిస్తుంటాం. అయితే మన ఆరోగ్య రంగం పరిస్థితి ఎలా ఉంది? ప్రభుత్వ వైద్య సేవలు ఏ మేరకు ఆశాజనకంగా ఉన్నాయి. అన్న ప్రశ్న అదే రంగంలో పనిచేస్తున్న నాకు ఎదురవుతుంది. కెనడా లోని అల్‌బెర్టా రాష్ట్రంలోని ఓ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వైద్యం కోసం వచ్చి 8 గంటలు వేచి చివరికి ప్రాణాలు కోల్పోయిన 44 ఏళ్ళ భారతీయ మూలాలు కలిగిన వ్యక్తి విషాద కథనం మనం విన్నాం. మన దేశంలోనూ అలాంటి పరిస్థితులే నెలకొని ఉన్నాయి. వైద్యుడు అందుబాటులోకి వచ్చే లోపే ప్రాణాలు కోల్పోతున్న పేషెంట్ల సంఖ్య తక్కువేమీ కాదు. ఇక డబ్బుగల వారికి జబ్బు చేసినా ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసయినా తగిన వైద్యం పొందగలుగుతున్నారు. ఈ మధ్యనే ఒక బడా కార్పొరేట్ ఆసుపత్రి తన ఆదాయం ప్రతి రోగికి తలసరిన 9 శాతం పెరిగి సుమారు ల డెబ్బై వేల రూపాయలకు పైగా గిట్టుబాటు అవుతున్నదని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో రెండవ త్రైమాసిక ఆర్జన వివరాలు ఆ కార్పొరేట్ ఆసుపత్రిలో పెట్టుబడులు పెట్టిన వాటాదారులకు వీనుల విందుగా ఉండి ఉంటాయిగానీ మనకు తీవ్ర ఆందోళన కలిగిస్తాయి.

ప్రజారోగ్య సంరక్షణ పట్ల నాకు ఉన్న అనురక్తి దృష్ట్యా×ప్రభుత్వం సార్వజనీన ప్రజారోగ్య సంరక్షణ కోసం కేవలం మాటలకే పరిమితమైతే సరిపోదనిపిస్తుంది. ఈ విశాల భూభాగంలో నివసించే ప్రతి పౌరుడికీ కావాల్సిన సకల వైద్య సేవలు సులువుగా అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం సుధృడమైన కృషి చేపట్టాలి. ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఎనలేని పెట్టుబడి అని ప్రభుత్వం గ్రహించాలి. అంతేగాక ఆరోగ్యాన్ని మానవ హక్కుగా పరిగణించాలి. ఆ హక్కును పరిపుష్టం చేసే నైతిక లక్ష్యంతో, భౌగోళిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించి పౌరులందరికీ సార్వజనీన వైద్య సౌకర్యం కల్పించేలా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి. ప్రభుత్వం కల్పించాల్సిన ఆరోగ్య సేవలు విస్తృతంగా ఉండాలి. రోగ నివారణ, రోగ నిర్ధారణ, తగిన సమయంలో తగిన వైద్యం అందేలా చూడడం, అవసరమైన మేరకు ఆసుపత్రిలో సంరక్షణ కల్పించడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యడం వంటి అంశాలన్నీ నెరవేర్చాలి.

కఠోర వాస్తవాలు: క్రియాశీల, సమత్వ, సహానుభూతితో కూడిన×ఆర్థికంగా అందరికీ మెరుగైన×ఆరోగ్య వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చెయ్యడం మౌలికమైన అవసరమని గుర్తించాలి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆర్థికంగా, మానవ వనరుల పరంగా అత్యంత పటిష్టంగా ఇంటింటికీ వైద్య సేవలు, అందించేంత శక్తివంతంగా ఉండాలి. వీటిని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలుగా, విశాల వేదికగా మలచడం ద్వారా అనేకానేక మానవాభివృద్ధి కార్యక్రమాలకు వీటినే మందుపీఠిన ఉండేలా రూపొందించవచ్చు. అయితే ప్రాథమిక ఆరోగ్య సేవలు విడిగా మనజాలవు. కొంత మందికి మరింత మెరుగైన వైద్యం అవసరం పడుతుంది. తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా సెకండరీ లేదా ప్రాంతీయ వైద్య సేవలు కూడా అందుబాటులోకి తీసుకురావాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' కేంద్రాలుగా పని చెయ్యాలి. అవసరమైన వారికి మెరుగైన, అధునాతన వైద్య సేవలు అందేలా చూడడంతో పాటు ఆసుపత్రి నుండి తిరిగి ఇంటికి వచ్చేశాక కూడా వైద్య పర్యవేక్షణ కొనసాగేలా చూడాలి. ఇదీ ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నమూనా. కాని ప్రస్తుతం మన ఆరోగ్య వ్యవస్థ ఈ నమూనాకు అత్యంత దూరంలో ఉందనేది కఠోర వాస్తవం.

మన దేశంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సేవలు అస్తుబిస్తుగా ఉన్నాయి. గిరిజన గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవల అందుబాటు చాలా బలహీనంగా ఉన్నది. ఇక 'జాతీయ ఆరోగ్య కార్యక్రమం'లో తమ స్థానం ఏమిటో తెలియని అయోమయ స్థితిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ నేషనల్ హెల్త్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులలో కోతలు పడుతున్నకొద్దీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ డోలాయమాన పరిస్థితులను ఎదుర్కొంటున్నది.


గత డిసెంబర్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతి 2000 మంది జనాభాకు 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' నెలకొల్పుతామంటూ చేసిన ప్రకటన మూలంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతం అవుతాయనే ఆశ చిగురించే అవకాశముంది. వివిధ రాష్ట్రాలలో ఇప్పటికే ఈ ఆరోగ్య మందిరాలను నెలకొల్పారుగానీ సెకండరీ/ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలతో వీటిని పూర్తి స్థాయిలో అనుసంధానం చెయ్యలేదు. అలాగే 'రిఫరల్ వ్యవస్థ కూడా చాలా బలహీనంగా ఉన్నది.

ఇక ప్రభుత్వ ప్రాయోజిత హెల్త్ ఇన్సూరెన్స్ పథకం 'ప్రధానమంత్రి జన ఆయుష్ యోజన' (పిఎం.జె.ఎ.వై) ఆసుపత్రిలో 'ఇన్-పేషెంట్' ఖర్చులకు పూచీ పడుతుంది కానీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవల ఖర్చులను 'కవర్' చేయడం లేదు. ప్రభుత్వ ప్రాయోజిత ఇన్సూరెన్స్ పథకాలేవీ 'అవుట్ పేషెంట్' చికిత్సకయ్యే ఖర్చులను భరించడం లేదు. వాస్తవానికి 'అవుట్ పేషెంట్' వైద్యానికి అయ్యే ఖర్చులో 60 నుండి 70 శాతం ఖర్చులు పరీక్షలు చేయించుకోవడానికి, మందులు కొనడానికే అవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అవసరమైన తక్షణ వైద్య సేవలు అందించడంతో పాటు మెరుగైన వైద్య సౌకర్యం అవసరమైన వారిని మాత్రమే సెకండరీ/ప్రాంతీయ ఆసుపత్రులకు 'రిఫర్' చేసే పటిష్ట వ్యవస్థగా కూడా పనిచేయాలి. చాలా దేశాల్లో రిఫరల్ వ్యవస్థను అనివార్యం చేశారు. తద్వారా సెకండరీ/ప్రాంతీయ ఆసుపత్రుల మీద ఒత్తిడి తగ్గుతుంది.

ఆరోగ్య సేవల ప్రైవేటీకరణతో తలెత్తే సమస్యలు: మన దేశంలో ప్రైవేటు వైద్యరంగ విస్తృతి చాలా ఎక్కువ. కాబట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' వ్యవస్థగా క్రియాశీలంగా పని చేయడంలో కూడా ఇబ్బందులు తలెత్తవచ్చు. ప్రభుత్వ రంగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా ఆసుపత్రి లేదా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని స్పెషలిస్టు డాక్టర్ల నుండి టెలీ వైద్య సలహాలు, సేవలు పొందే వ్యవస్థను అభివృద్ధి చేయాలి. అయితే ప్రైవేటు కార్పొరేట్ వైద్యరంగ విస్తృతి మూలంగా, ప్రాథమిక ఆరోగ్య రంగ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం మూలంగా, వైద్య వృత్తిలో నిపుణులు, నిపుణులు కానివారు కూడా ఉండడం వల్లనా చాలా చిక్కులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య రంగంలోకి కార్పొరేట్ ప్రైవేటు రంగం కాలుపెడితే 'రిఫరల్' వ్యవస్థ ఆసుపత్రులకు లబ్ధి చేకూర్చే సాధనంగా మారుతుంది.

కార్పొరేట్ ఆసుపత్రులు ప్రధానంగా నగరాలు, పెద్ద పట్టణాల్లో కేంద్రీకృతమై ఉన్నాయి. ఇవి అత్యంత ఆధునిక వైద్య సేవలు అందిస్తాయి. కానీ దానికి అయ్యే ఖర్చులు భారీగా ఉంటాయి.

ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'ఎయిమ్స్' వైద్య సంస్థలను నెలకొల్పడం




ద్వారా 'ప్రాంతీయ' వైద్య సేవలను ప్రభుత్వ రంగంలో ఉండేందుకు తగిన చర్యలు తీసుకుంటుంది. ప్రభుత్వ నిర్వహణలో ఉన్న ప్రైవేటు యాజమాన్య కాలేజీ ఆసుపత్రులు కూడా ఈ సేవలు అందించవచ్చు. అయితే సెకండరీ వైద్యసేవల రంగం ఇప్పటికీ బలహీనంగా ఉంది కాబట్టి తక్షణమే జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలి. అటు కేంద్ర ప్రభుత్వంగానీ, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలుగానీ జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేయడానికి తగిన నిధులు కేటాయించకపోగా ఇందులో వివిధ సేవలను అవుట్‌సోర్స్ చేయడం లేదా ప్రైవేటు రంగం మౌలిక సౌకర్యాల పెంపుదలకు పెట్టుబడులు పెడితే యాజమాన్య నిర్వహణను వాటికి అప్పచెప్పడం కొనసాగుతుంది. దీనిమూలంగా సార్వజనీన ప్రాథమిక ఆరోగ్య సేవలు అందించాలన్న లక్ష్యం, దీనితో అనుసంధానించి అందించాల్సిన సెకండరీ, ప్రాంతీయ వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి రాకుండా పోతున్నాయి.

జిల్లా ఆసుపత్రుల్లో రేడియాలజీ, లేబొరేటరీ సేవలు అందించడానికి తగిన యంత్రాంగం, సాంకేతిక సిబ్బంది కొరత వల్ల వీటిని ఇప్పటికే చాలా రాష్ట్రాల్లో ప్రైవేటు రంగానికి అప్పచెప్పారు. అలాగే కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటు వైద్య కళాశాలల స్థాపనకు అనువుగా జిల్లా ఆసుపత్రులను ఆయా కాలేజీలకు అప్పజెప్పాలనే ఆలోచనలో ఉన్నాయి. జిల్లా ఆసుపత్రుల్లో మౌలిక సౌకర్యాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించకపోవడం మూలంగా ఈ దుస్థితి నెలకొన్నది. ప్రజారంగ ఆరోగ్య సేవలను ఏకీకృతం చెయ్యడం పట్ల విముఖత, ప్రైవేటు రంగం పట్ల ఉన్న మోజు మూలంగా ఈ ధోరణులు తలెత్తుతున్నాయి. ఇక్కడ మన గమనంలో ఉండాల్సిన ముఖ్యాంశం ఏమిటంటే ప్రైవేటు వైద్య రంగం ప్రధాన లక్ష్యం లాభార్జన మాత్రమే.

కోవిడ్ మహమ్మారి సమయంలో ప్రైవేటు వైద్య రంగం అసలు రంగు బయట పడింది. కోవిడ్ వ్యాక్సిన్లలో కూడా ఈ రంగం వాటా కేవలం 2 శాతమే. ప్రభుత్వమే వ్యాక్సిన్లు సరఫరా చేసినా ప్రజలకు సేవలు అందించడంలో మాత్రం ప్రైవేటు రంగం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరించింది.

క్షేత్ర స్థాయి వాస్తవాలు ఇవీ. ప్రభుత్వ రంగ వైద్య సేవలు అందుబాటు నానాటికీ క్షీణిస్తుంటే ప్రైవేటురంగం విపరీతంగా ఆదాయాలు పోగేసుకుంటున్నది. కేంద్ర ప్రభుత్వం వైద్య విద్య, ఆరోగ్య సంరక్షణను అల్లోపతి, ఆయుర్వేద వైద్యాల జమిలి తరహాలో ఏకీకృతం చెయ్యాలని యోచిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రైవేటు రంగం జిల్లా ఆసుపత్రుల నిర్వహణను ఏమేరకు చేపడుతుందనేది సందేహమే. జిల్లా ఆసుపత్రులను బలోపేతం చేసి వాటికి అనుబంధంగా నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను స్థాపించడమే సరైన పరిష్కారం అవుతుంది. జిల్లా ఆసుపత్రులను, వైద్య విద్యను ప్రైవేటీకరించడం మూలంగా సార్వజనీన ఆరోగ్య సేవలను అందజేయాలన్న లక్ష్యం దెబ్బతినిపోతుంది. మిశ్రమ ఆరోగ్య వ్యవస్థలో ప్రభుత్వం ప్రైవేటురంగ సేవలను కూడా యాథాశక్తి వినియోగించుకోవాలి గానీ సార్వజనీన ఆరోగ్య సంరక్షణ పట్ల తనకున్న బాధ్యతను వదిలించుకోవాలని చూడకూడదు. చివరిగా, మనం జపాన్ ను కూడా వెనక్కినెట్టి ప్రపంచంలోనే నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించామని చెప్పుకుంటున్న నేపథ్యంలో ఆరోగ్యకర భారతదేశం అన్న ఆకాంక్షను సాకారం చేసుకోవాలే తప్ప ఆ బాధ్యతను వదిలించుకోవాలని చూడకూడాదు. ప్రభుత్వం మనసుపెట్టి చిత్తశుద్ధితో వ్యవహరిస్తే మన ఆరోగ్య వ్యవస్థను చూసి కెనడా కూడా అసూయపడేలా చూడవచ్చు. గుండె వైద్య నిపుణుడిగా నేను చెప్పే మాటలు అక్షర సత్యాలు.

## పట్టణంలో మత్తు పదార్థాలపై నార్కోటిక్ జాగిలంతో ప్రత్యేక తనిఖీలు



(ఆదిలాబాద్)

వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో నార్కోటిక్ జాగిలం "రోమా"తో కలిసి మత్తు పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఈ తనిఖీల్లో భాగంగా శాంతినగర్, బొక్కలగూడ కల్లు కాంపౌండ్లు, గౌరమ్మబట్టి, కుమ్మరివాడ ప్రాంతాల్లో గంజాయి తదితర మాదకద్రవ్యాల కోసం తనిఖీ చేపట్టారు. అదేవిధంగా గాంధీ పార్క్, ఏరోడ్రం ప్రాంతం, సత్నాల బస్టాండ్ పరిసరాలు మరియు హొటళ్లలో కూడా మత్తు పదార్థాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు కొనసాగించనున్నట్లు పోలీసులు తెలిపారు.

## సాంగిడిలో ఇంటింటికి గృహజ్యోతి పత్రాలు పంపిణీ..

### పాల్గొన్న సర్పంచ్ ఉప సర్పంచ్‌లు..

### గ్రామ ప్రజలకు ఇప్పటి వరకు ప్రతి నెల 3.42 లక్షలు చెల్లిస్తుందన్న సామ రూపేష్ రెడ్డి..



(ఆదిలాబాద్)

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న గృహజ్యోతి పథకంలో భాగంగా ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని సాంగిడి గ్రామ ప్రజలకు యువజన కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచి భూపతి రెడ్డి ఉప సర్పంచ్ జిమ్మ శేఖర్ తో కలిసి గృహజ్యోతి పథకం పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం గ్రామంలోని అర్హులైన గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు ప్రతినెల 3,42,000 పై చిలుకు రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తుందని వారు ఇంటింటికి వెళ్లి వివరించారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వమే గృహజ్యోతి పథకం ద్వారా అర్హులైన లబ్ధిదారుల కరెంట్ బిల్లులను భరిస్తున్నందున ఈ బిల్లు రూపంలో చెల్లించే డబ్బులను ఇప్పటికైనా ప్రజలు వారి పిల్లల చదువుల కోసం ఖర్చు చేయాలని ఆయన సూచించారు.

ఇలాంటి మహత్తర పథకాన్ని అమలు చేయడం ద్వారా ఎందరో మంది ప్రజలు కరెంట్ బిల్లులు చెల్లించే అవసరం లేకుండా పోయిందని స్వయంగా తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు గృహజ్యోతి పత్రాలను ఈ పథకం పొందుతున్న ప్రజలకు పంపిణీ చేయడం జరిగిందని వివరించారు. అదేవిధంగా ప్రభుత్వం గృహజ్యోతి పథకం ద్వారా కరెంట్ బిల్లు భరిస్తున్నందున ఎవరు కూడా కరెంటును వృధా చేయకుండా సమయానుకూలంగా వాడుకొని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ లైన్ మెన్ రమేష్,వార్డ్ మెంబర్లు వినోద్,మంచికంటి సాయి మంచికంటి ఉషన్న,సిద్రప్ సునీల్,సతీష్,బేల మండలం యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ మేకల జితేందర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సామ నర్సారెడ్డి,రవీందర్ పటేల్,దయాకర్ పటేల్,సునీల్,సుధాకర్,మంచికంటి నవనీత్,అమోల్,ప్రభాకర్,కుంట అచ్యుత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## భైంసా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

(నిర్మల్)


భైంసా పట్టణంలోని వివిధ కాలనీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు యూ.ఐ.డి.ఎఫ్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, నేషనల్ హౌసింగ్ బ్యాంక్ సహకారంతో మొత్తం రూ.28 కోట్ల నిధులు విడుదలైనట్టు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలిపారు. పట్టణంలోని ఎస్.ఎస్. జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నిధులతో పట్టణ వ్యాప్తంగా తాగునీటి సరఫరా వ్యవస్థను పటిష్టం చేస్తామని అన్నారు.

కొత్త పైప్‌లైన్‌ల ఏర్పాటు, నీటి ట్యాంకుల నిర్మాణం ద్వారా ప్రతి కాలనీకి నిరంతర తాగునీటి సరఫరా అందించనున్నట్లు వివరించారు. అదే విధంగా అమృత్ మహోత్సవ్ పథకం ద్వారా రూ.2 కోట్ల 14 లక్షల నిధులతో షేరకట్ట మహాదేవ్ మందిర్ చెరువును ఆధునికీకరించనున్నట్లు తెలిపారు. చెరువులోకి మురికి నీరు



చేరకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, మహాదేవ్ మందిరాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ నిధులు మంజూరు చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి బండి సంజయ్‌ను కలిసిన గునుకుల కొండాపూర్ సర్పంచ్..



కరీంనగర్

కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను గునుకుల కొండాపూర్ సర్పంచ్, బీజేపీ రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి కోసం కేంద్ర నిధులు మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీ మినరల్ వాటర్ ప్లాంట్, రజక కమ్యూనిటీ హాల్, ఆరే క్షత్రియ భవనానికి కాంపౌండ్ వాల్, ముదిరాజ్ కమిటీ హాల్, పెద్దమ్మ గుడి చుట్టూ ప్రహరీ గోడ, బోరు బావులు, సీసీ రోడ్లు, ఎమ్మార్పీఎస్ భవనం, మాల కమ్యూనిటీ హాల్ పెండింగ్ పనులు, పద్మశాలి భవనం, వడ్డెర కమ్యూనిటీ హాల్, మేదరి సంఘ భవనం తదితర అన్ని కుల సంఘాలకు భవనాలు మంజూరు చేయాలని కోరారు. అవసరమైన చోట సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అలాగే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, ఛత్రపతి శివాజీ, సాకలి ఐలమ్మ, సర్వే పాపన్న స్వామి, స్వామి వివేకానంద విగ్రహాల ఏర్పాటు కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దూర్ మహేందర్, బట్టు సంపత్, బూట్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

# రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినాలి.. ఎందుకో తెలుసా..?



రోజూ ఉదయం మనం అనేక రకాల బ్రేక్‌ఫాస్ట్‌లను తింటుంటాం. ఇడ్లీ, దోశ, పూరీ ఇలా వెరైటీ టిఫిన్లను తింటాం. అయితే బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు పలు ఆరోగ్యవంతమైన ఆహారాలను తినాల్సి ఉంటుంది. దీంతో మనం అధికంగా ప్రయోజనాలను పొందవచ్చు. రోజూ ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో ఆరోగ్యవంతమైన ఆహారాలను తింటే పోషణ లభించడమే కాదు, శరీరానికి శక్తి అందుతుంది. దీంతో రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉంటారు. అలాగే రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. ఇక ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో కలిపి తినాల్సిన ఆరోగ్యవంతమైన ఆహారాల్లో మొలకెత్తిన పెసలు కూడా ఒకటి. వీటినే మొలకలు అని కూడా అంటారు. వీటిని ఉదయం తింటే ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

**పోషకాలు..:** రోజూ ఉదయం మొలకెత్తిన పెసలను తినడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి. ఈ పెసలను తింటే వృక్ష సంబంధమైన ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి, మరమ్మత్తులకు ఎంతగానో దోహదపడతాయి. ఉదయం మొలకలను తినడం వల్ల రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉండవచ్చు. ఉత్తేజంగా పనిచేస్తారు. బద్ధకం లేకుండా ఉంటుంది. ఎంత పనిచేసినా అలసిపోరు. పెసలను తినడం వల్ల పలు ఎంజైమ్‌లు మన శరీరంలో ఉత్పత్తి అవుతాయి. ఇవి జీర్ణక్రియను మెరుగు పరుస్తాయి. దీంతో మన శరీరం పోషకాలను సరిగ్గా శోషించుకుంటుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. రోజూ సుఖ విరేచనం కలుగుతుంది. పెసలను తింటే అజీర్తి, గ్యాస్, కడుపు ఉబ్బరం నుంచి కూడా బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది.

**విటమిన్ సి..:** పెసలలో విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు. రోగాలు రాకుండా ఉంటాయి. పెసలలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో చర్మంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. ముఖం కాంతివంతంగా మారుతుంది. యవ్వనంగా కనిపిస్తారు. పెసలలో క్యాలరీలు తక్కువగా ఉంటాయి. అందువల్ల బరువు నియంత్రణలో ఉండాలనుకునే వారు పెసలను ఆహారంలో భాగం చేసుకోవాలి. పెసలను రోజూ తినడం వల్ల బరువు తగ్గుతారు. అలాగే శరీరానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి.

**కొలెస్ట్రాల్ స్థాయిలు..:** పెసలలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. పెసలలో ఉండే పొటాషియం కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. దీంతో రక్త సరఫరా నియంత్రణలోకి వస్తుంది. బీపీ తగ్గుతుంది. హృదయ సంబంధ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మొలకెత్తిన పెసల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. కనుక షుగర్ ఉన్నవారికి ఇవి బెస్ట్ ఆప్షన్ అని చెప్పవచ్చు. వీటిని తింటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. మధుమేహం ఉన్నవారు రోజూ మొలకలను తింటుంటే షుగర్ లెవల్స్‌ను కంట్రోల్ చేయవచ్చు. మొలకలను తినడం వల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు పోతాయి. శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. దీంతో రోగాలు రాకుండా ఉంటాయి. ఇలా పెసలను మొలకెత్తించి తింటే అనేక లాభాలను పొందవచ్చు.

## మీ కండరాలు బలంగా ఉన్నాయా.. అయితే మధుమేహం ముప్పు తప్పినట్టే!



న్యూఢిల్లీ: కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు 44 శాతం తగ్గుతుందని వెల్లడైంది. యూకే బయోబ్యాంక్ నుంచి 1.4 లక్షల మంది సమాచారాన్ని విశ్లేషించి హాంకాంగ్ విశ్వవిద్యాలయం పరిశోధకులు ఈ విషయం తేల్చారు. మధుమేహం ముప్పు అధికంగా ఉన్నవారి కండరాలు బలంగా ఉంటే, మధుమేహం ముప్పు వృద్ధి చెందే అవకాశాలు తగ్గుతాయని చెప్పారు. ఈ అధ్యయన నివేదిక బయోమెడ్ సెంట్రల్ మెడిసిన్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. హాంకాంగ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ యంగ్వన్ కిమ్ మాట్లాడుతూ, వారానికి రెండు రోజులు, 150-300 నిమిషాలపాటు కండరాల పటిష్టత కోసం కృషి చేయాలని తెలిపారు. కండరాల పటిష్టత ఓవరాల్ ఫిట్‌నెస్‌కు ముఖ్యమని చెప్పారు. నడి వయసు నుంచి వృద్ధాప్యం వరకు టైప్-2 మధుమేహం ముప్పును ఎదుర్కొనే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పరిశోధనలో తేలిందని ఆయన చెప్పారు.

# అరిగిన కీళ్లకు కణాలతో వైద్యం





**మోకాళ్ల నొప్పులు వృద్ధాప్య సమస్యల్లో ఒకటిగా చెప్పుకొనేవారు. అదంతా ఒకప్పుడు. ఇప్పుడు నలభై ఏళ్లకే మోకాళ్లే కాదు ఇతర కీళ్లలోనూ నొప్పులతో తిప్పలు పడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. ఈ సమస్యకు సకాలంలో చికిత్స చేయకపోతే శస్త్ర చికిత్స చేయాల్సిందే. ప్రారంభంలోనే పీఆర్‌పీ థెరపీతో కీళ్ల నొప్పులకు చెక్ పెట్టొచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ కీళ్ల నొప్పులకు కారణాలు ఏమిటి? నొప్పికి ముందే వాటిని ఎలా గుర్తించాలి? ఆపరేషన్ లేకుండానే పీఆర్‌పీ థెరపీతో ఎలా నివారించవచ్చో నేటి ఊపిరిలో తెలుసుకుందాం.**

కీళ్ల నొప్పులు వయసుతో సంబంధం ఉన్న వ్యాధుల్లో ఒకటిగా వైద్యులు గుర్తించారు. జీవనశైలిలో, ఆహారపు అలవాట్లలో మార్పులతో కీళ్ల నొప్పులకూ వయోసడలింపు వచ్చేసింది. అరవైకి ఇరవై ఏళ్ల ముందే మోకాళ్ల నొప్పులు బాధిస్తున్నవారు నానాటికీ పెరుగుతున్నారు. మోకీళ్లే కాదు భుజం నొప్పి, వెన్ను నొప్పి, తుంటి నొప్పి%ౌ% ఇలా శరీరంలోని కీళ్ల నొప్పులతో బాధపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. కీళ్ల నొప్పులకు జీవన శైలి, ఆహారమే కాదు నిర్లక్ష్యమూ ఓ కారణమే.

మోకాలి నొప్పులు: కొందరిలో మోకాలి కీలులోని కార్టిలేజ్ అరుగుతుంది. దీని వల్ల కీళ్లలోని ఎముకల మధ్య రాపిడి జరుగుతుంది. అప్పుడు కీలులో నొప్పి కలుగుతుంది. ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఈ నొప్పి వల్ల రోగి లేవడం, నడవడం కష్టంగా ఉంటుంది. వయసు రీత్యా వచ్చే ఈ సమస్యను ప్రారంభదశలోనే గుర్తించి, పీఆర్‌పీ థెరపీ చేస్తే.. సర్జరీ అవసరమే ఉండదు. సమస్యను నిర్లక్ష్యం చేస్తే, రోగం ముదిరిన తర్వాత చికిత్స చేయాలంటే శస్త్ర చికిత్స ద్వారా కీలు మార్పిడి చేయడమే పరిష్కారం.

భుజం నొప్పి: భుజాల్లోని టెండాన్ (ఎముకను అతుక్కుని ఉండే కండరాల అంచు)కు పగుళ్లు రావడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడుతుంది. అంటే ఎముకను అతుక్కునే కండరం చివరి భాగం దెబ్బతిని, ఎర్రగా మారుతుంది. అందువల్ల భుజంలో నొప్పి కలుగుతుంది. చేతిని అటూ, ఇటూ, పైకి, కిందికి కదిలించేటప్పుడు ఇబ్బందిగా ఉంటుంది. సమస్య తీవ్రంగా ఉంటే చేయి కదిలించడం కష్టం. చేతిని కదల్చలేని 'ఫ్రొజన్ షోల్డర్' అంటారు. ఈ సమస్యను సకాలంలో గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో నివారించవచ్చు. నిర్లక్ష్యం చేస్తే సర్జరీ తప్పదు.

ఎవ్యాస్క్యులర్ నెక్రోసిస్ ఆఫ్ హిప్: కరోనా చికిత్సలో స్టెరాయిడ్స్ వినియోగించడం వల్ల ఈ సమస్యతో బాధపడే రోగుల సంఖ్య కోవిడ్ తర్వాత పెరిగింది. స్టెరాయిడ్స్ వాడితే తుంటిలోని కీళ్లలో రక్త ప్రసరణ తగ్గుతుంది. తుంటిలోని ఎముక కుళ్లుతుంది. నొప్పి తీవ్రంగా బాధిస్తుంది. తుంటిని కదిలించలేరు. ఈ సమస్య చిన్న వయసులో వస్తే వారికి పీఆర్‌పీ చికిత్స ఉత్తమమైన పద్ధతి.

టెన్నిస్ ఎల్బో సమస్య: మోచేతిలోని ఒక చిన్న ఎముకతో ఐదు కండరాలు అనుసంధానమవుతాయి. ఈ కండరాలను 'కామన్ ఎక్స్‌టెన్షన్ టెండాన్' అంటారు. ఆటలు ఆడినప్పుడు, ఏదైనా దెబ్బ తగిలినప్పుడు ఆ కండరాలు ఎముకతో అనుసంధానమైన చోట పగుళ్లు ఏర్పడతాయి. అందువల్ల తీవ్రమైన నొప్పి కలుగుతుంది. ఆటలు ఆడలేరు. అలాంటి వారికి శస్త్ర చికిత్స అందుబాటులో లేదు. వారికి పీఆర్‌పీ థెరపీతో ఉపశమనం ఉంటుంది.

అరికాళ్లలో నొప్పి: అరికాళ్లలో నొప్పి (మడమ నొప్పి)ని 'ప్లాంటార్ ఫేషి ఐటీస్' అంటారు. ఎక్కువగా నడవడం వల్ల, చెప్పులు లేకుండా పనిచేయడం వల్ల, గరుకు ప్రదేశాల్లో చెప్పులు లేకుండా నడవడటం వల్ల మడమలో ప్లాంటర్ పొర తెగుతుంది. అప్పుడు మడమ (అరికా ళ్ల)లో తీవ్రమైన నొప్పి కలుగుతుంది. నడవడం కష్టమవుతుంది. ఈ సమస్యకు కూడా సర్జరీ లేదు. పీఆర్‌పీ థెరపీ చక్కటి పరిష్కారం.

ప్రారంభ దశలో..: కొంతమంది 30 నుంచి 40 ఏళ్ళ మధ్య వయసులో జాయింట్ పెయిన్స్ వస్తే.. అవగాహన లేక పట్టించుకోరు. ఉపశమనం కోసం ఆయింట్‌మెంట్లు రాసుకుంటారు. నూనెలతో మర్దనా చేసుకుంటారు. కొంతమంది నొప్పుల మాత్రలు వాడతారు. ఇవి వాడటం వల్ల తాత్కాలిక ఉపశమనం కలుగుతుంది. కొన్నిరోజుల తర్వాత సమస్య మళ్లీ మొదటికి వస్తుంది. ఇంకొందరు కొన్ని ప్రత్యేక వ్యాయామాల ద్వారా తగ్గించుకోవచ్చని ప్రయత్నాలు చేస్తుంటారు. వ్యాయామాలతో కీళ్ల నొప్పులు తగ్గకపోవడమే కాకుండా తీవ్రమవుతాయి. అందుకని తరచూ నొప్పులు వచ్చినా లేక దీర్ఘకాలంగా నొప్పులు బాధిస్తున్నా వైద్యులను సంప్రదించాలి. ఎక్స్‌రే లేదా స్కానింగ్ తీయించుకోవాలి. ఇబ్బందిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే పీఆర్‌పీ థెరపీతో ఆదిలోనే సమస్యకు అడ్డుకట్ట వేయవచ్చు.

కీళ్ల సమస్యల లక్షణాలు: కీళ్లలో తీవ్రమైన నొప్పి రావడం, 15 రోజుల పాటులేదా తరచూనొప్పి ఉంటే కీళ్లలో డ్యామేజ్ ఉందేమోనని అనుమానించాలి. కీళ్లను కదిలించలేకపోవడం, కీళ్లలో వాపు.

మణికట్టు, భుజం, చీలమండ, భుజంలో తీవ్రమైన నొప్పి పీఆర్‌పీ థెరపీ ఎలా చేస్తారు?: 'ప్లేట్‌లెట్స్ రిచ్ ప్లాస్మా' థెరపీని 'పీఆర్‌పీ థెరపీ' అంటారు. ఇది పాత చికిత్సా పద్ధతే! కొన్ని కారణాల వల్ల ఈ పద్ధతి ప్రాచుర్యంలో లేదు. ఐదారేళ్ల నుంచి ఈ చికిత్సా విధానానికి ఆదరణ పెరుగుతున్నది. ఈ థెరపీ గురించి అనేక పరిశోధనలు జరిగాయి. మెరుగైన ఫలితాలు గుర్తించడంతో దీనికి మళ్లీ డిమాండ్ పెరిగింది. ఈ పీఆర్‌పీ చికిత్సా పద్ధతిలో రోగి నుంచి 20 మిల్లీ లీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. ఆ రక్తాన్ని ఒక టెస్ట్ ట్యూబ్‌లో నింపిన తర్వాత పీఆర్‌పీ సెంట్రిఫ్యూజ్ మెషిన్‌లో తిప్పుతారు. రక్తం నుంచి 'గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్' వేరవుతాయి. ఈ సెల్స్‌ను దెబ్బతిన్న కీలు భాగంలోకి ఇంజెక్షన్ ద్వారా ఇస్తారు. కార్టిలేజ్ దెబ్బతిన్న భాగంలోకి గ్రోత్ ఫ్యాక్టర్ సెల్స్'ని పంపడం వల్ల ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది. కార్టిలేజ్ రీ మోడలింగ్ (పునరుత్పత్తి) జరుగుతుంది. ఈ విధంగా సమస్య తీవ్రతను బట్టి రెండు లేదా మూడు సార్లు పీఆర్‌పీ థెరపీ చేయాల్సిన అవసరం ఉంటుంది. థెరపీ అనంతరం మూడు నుంచి నాలుగు నెలలపాటు వైద్యుల పరిశీలన (ఫాలో అప్) అవసరం. థెరపీ అనంతరం కొన్ని జాగ్రత్తలు, ఆహార నియమాలు పాటించాలి. వైద్యులు సూచించిన వ్యాయామాలు చేయాలి. క్రీడల్లో గాయపడ్డ వారికి కూడా పీఆర్‌పీ థెరపీ మంచి ఫలితాలు ఇస్తుంది.

# రోజూ పచ్చి కొబ్బరిని తినడం అలవాటు చేసుకోండి..



పూజలు లేదా ఇతర శుభ కార్యాలు జరిగినప్పుడు హిందువులు కొబ్బరికాయలను కొడుతుంటారు. ఆ తరువాత వాటిని నైవేద్యంగా పెట్టి తమ కోరికలను నెరవేర్చమని కోరుకుంటారు. అలాగే చాలా మంది ఇలాంటి కార్యక్రమాలకు కొబ్బరికాయలను ఉపయోగించకపోయినా తరచూ వంటల్లో మాత్రం కొబ్బరిని వేస్తుంటారు. కొందరు పచ్చి కొబ్బరిని వంటల్లో వేస్తే కొందరు ఎండు కొబ్బరిని వేస్తారు. కొబ్బరి వేస్తే వంటలకు మంచి రుచి, వాసన వస్తాయి. అయితే ఆరోగ్యపరంగా కొబ్బరి మనకు ఎన్నో ప్రయోజనాలను అందిస్తుంది. ఇందులో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. కొబ్బరిని రోజూ ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

జీర్ణ సమస్యలకు..: జీర్ణ సమస్యలతో బాధపడేవారికి కొబ్బరి ఔషధంగా పనిచేస్తుంది. రోజూ ఒక చిన్న పచ్చి కొబ్బరి ముక్కను కాస్త బెల్లంతో కలిపి రాత్రి పూట భోజనం చేసిన అనంతరం తింటుండాలి. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. జీర్ణాశయం, పేగుల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. మలబద్దకం తగ్గుతుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణమవుతుంది. అజీర్తి తగ్గుతుంది. గ్యాస్ సమస్య నుంచి బయట పడవచ్చు. కొబ్బరిలో ఉండే ఫైబర్ జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. రోజూ కొబ్బరిని తినలేకపోతే రాత్రి పూట నిద్రకు ముందు ఒక టీస్పూన్ కొబ్బరి నూనెను సేవించవచ్చు. ఇది కూడా జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది.

వేడి తగ్గేందుకు..: విరేచనాలు అయినప్పుడు కొబ్బరిని తింటే ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. జీర్ణాశయంలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. కొబ్బరిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ముఖ్యంగా పచ్చి కొబ్బరిలో ఇది కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. రక్త ప్రసరణ సరిగ్గా అయ్యేలా చూస్తుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. పచ్చి కొబ్బరిని వేసవిలో తింటే శరీరం చల్లగా ఉంటుంది. శరీరంలోని వేడి పోతుంది. కొబ్బరి మన శరీరానికి చలువ చేస్తుంది. కాబట్టి పచ్చి కొబ్బరిని వేసవిలో తినాలి. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

మూత్రాశయ సమస్యలకు..: వేసవిలో చెమట కాయలు అధికంగా అవుతుంటాయి. అలాగే కొందరికి విపరీతంగా చెమట వచ్చి శరీరం దుర్వాసనగా ఉంటుంది. అలాంటి వారు కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. లేదా కొబ్బరి నీళ్లను కాస్త నీటిలో వేసి కలిపి ఆ నీటితో స్నానం చేస్తున్నా సమస్యలు తగ్గుతాయి. పొట్టలో నులి పురుగుల సమస్య ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటుంటే ఫలితం ఉంటుంది. జీర్ణాశయం శుభ్రంగా ఉంటుంది. మూత్రాశయ సమస్యలు ఉన్నవారు రోజూ కొబ్బరిని తింటున్నా లేదా కొబ్బరి నీళ్లను తాగుతున్నా ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. కొబ్బరిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ పంగల్, యాంటీ వైరల్ గుణాలు మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లకు కారణం అయ్యే క్రిములను నిర్మూలిస్తాయి. దీంతో ఇన్‌ఫెక్షన్ తగ్గుతుంది. అలాగే కిడ్నీల్లో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కిడ్నీ స్టోన్స్ కరిగిపోతాయి. ఇలా కొబ్బరిని రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

# వంకాయలను తేలిగ్గా తీసుకుంటే ఎన్నో లాభాలను కోల్పోతారు..!




వంకాయలను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇందులో అనేక రకాలు ఉంటాయి. పర్పుల్, తెలుపు,గ్రీన్ కలర్‌లలో వంకాయలు మనకు అందుబాటులో ఉన్నాయి. వంకాయలతో ఏ కూర చేసినా సరే ఎంతో రుచిగా ఉంటుంది. వంకాయలతో పచ్చడి, టమాటా కూర, వేపుడు ఎక్కువగా చేస్తుంటారు. వంకాయల్లో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. 100 గ్రాముల వంకాయలను తినడం వల్ల సుమారుగా 17.8 గ్రాముల పిండి పదార్థాలు లభిస్తాయి. ప్రోటీన్లు 8 గ్రాములు, శాచురేటెడ్ కొవ్వులు 5.2 గ్రాములు, ఫైబర్ 4.9 గ్రాములు, కొవ్వు 27.5 గ్రాములు, కొలెస్ట్రాల్ 16 మిల్లీగ్రాములు, చక్కెరలు 11.4 గ్రాములు, ఐరన్ 6 మిల్లీగ్రాములు లభిస్తాయి.

విటమిన్ ఎ అధికం..: వంకాయలను తింటే విటమిన్ ఎ అధికంగా లభిస్తుంది. అలాగే క్యాల్షియం, సోడియం, పొటాషియం కూడా అధిక మొత్తంలో పొందవచ్చు. ప్లీహం వాపులకు గురైన వారు వంకాయలను తింటే ఎంతో ఫలితం ఉంటుంది. పచ్చి వంకాయ పేస్టుకి చక్కెర కలిపి ఉదయం తినాలి. దీంతో కొలెస్ట్రాల్‌ను తగ్గించుకోవచ్చు. వంకాయ, టమాటా కలిపి తింటే అజీర్తి తగ్గుతుంది. ఆకలి పెరుగుతుంది. వంకాయను తినడం వల్ల గ్యాస్, అసిడిటీ, కఫం వంటి సమస్యలు తగ్గుతాయి. వంకాయను ఉడకబెట్టి తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం కాస్త తింటే నిద్ర చక్కగా పడుతుంది. నిద్రలేమితో బాధపడేవారికి ఇది మంచి ఔషధంగా పనిచేస్తుంది.

సూప్ కూడా తాగవచ్చు..: వంకాయ సూప్‌ను కూడా తయారు చేసి తీసుకోవచ్చు. ఇందులో ఇంగువ, వెల్లుల్లి వేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. ఈ సూప్‌ను తాగితే కడుపు ఉబ్బరం నుంచి ఉపశమనం లభిస్తుంది. షుగర్ ఉన్నవారు వంకాయలను తింటే డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చు. వంకాయల్లో ఉండే ఫైబర్ షుగర్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తుంది. కొన్ని ఆఫ్రికా దేశాల వారు వంకాయలను ఫిట్స్ తగ్గించేందుకు వాడుతారు. వంకాయల నుంచి రసం తీసి తయారు చేసిన ఆయింట్ మెంట్లు, టించర్లు పైల్స్‌ను తగ్గించేందుకు సహాయం చేస్తాయి. వంకాయలను పేదవారి ప్రోటీన్ ఫుడ్‌గా చెప్పవచ్చు. వంకాయలను తింటే ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. ఇవి శరీరానికి శక్తిని అందించడమే కాకుండా కండరాల నిర్మాణానికి దోహదం చేస్తాయి.

వీరు తినకూడదు..: అల్సర్ సమస్య ఉన్నవారు వంకాయలను తినకూడదు. గర్భిణీలు వంకాయలను తినడం మంచిది కాదు. తింటే అలర్జీలు వచ్చే ప్రమాదం ఉంటుంది. కొందరికి వంకాయ పడదు. దీన్ని తిన్న వెంటనేఅలర్జీలు వచ్చి శరీరందురద పెట్టే అవకాశంఉంది. చర్మ వ్యాధులు ఉన్నవారు కూడా వంకాయలకు దూరంగా ఉండాలి. వంకాయలను తినడం వల్ల ఆరోగ్యకరమైన ప్రయోజనాలుకలిగే మాటవాస్తవమే అయిన ప్పటికీ ఆయా సమస్యలు ఉన్నవారు మాత్రం వీటికి దూరంగా ఉండాలి. అలాగే ఆపరేషన్ చేయించుకోబోతున్న వారు, చేయించుకున్నవారు కూడా వంకాయలను తినకూడదు. గుండె జబ్బులు ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు మాత్రమే వంకాయలను తినాలి. వంకాయలను అతిగా తింటే వాతం చేస్తుంది. కాబట్టి వీటిని మోతాదులోనే తినాలి.

# 19 నుంచి కొత్త సర్పంచులకు శిక్షణ తరగతులు




(హైదరాబాద్)

రాష్ట్రంలో కొత్తగా ఎన్నికైన సర్పంచులకు ఈ నెల 19 నుంచి వచ్చే నెల 21 వరకు శిక్షణ తరగతులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ (టీజీఐఆర్డీ) ఆధ్వర్యంలో జిల్లాల వారీగా వీటిని నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేసింది. గత నెలలో జరిగిన ఎన్నికల్లో 12,702 గ్రామాలకు నూతనంగా సర్పంచులు ఎన్నికయ్యారు. ఇందులో 85% మంది కొత్తవారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో, నిధుల పంపిణీ నిబంధనల్లో మార్పులు వచ్చిన నేపథ్యంలో సర్పంచులందరికీ శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. శిక్షణ కోసం 253 మంది మాస్టర్ ట్రైనర్ల ద్వారా ఇప్పటికే ట్రైనర్లకు పునశ్చరణ తరగతులను నిర్వహించారు.

సర్పంచులకు వారి అధికారాలు, విధులు, పాలన, ఆర్థిక నిర్వహణ, నిధులు, గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల సమర్థ అమలుతో పాటు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంపై వీరు అవగాహన కల్పించనున్నారు. శిక్షణ కోసం ఒక్కో బృందంలో 50 మంది చొప్పున ప్రతి జిల్లాలోని సర్పంచులను ఐదు బృందాలుగా విభజించనున్నారు. అనంతరం 5 రోజుల పాటు ఆయా జిల్లాల్లో తరగతులు నిర్వహిస్తారు. వారికి బస, భోజనం, శిక్షణా ఖర్చుల కోసం ఒక్కొక్కరికి రూ. 5,000 వరకు వెచ్చిస్తారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. ఈ తరగతులు సర్పంచులకు ఎంతగానో ఉపయోగపడతాయని, పారదర్శకమైన పాలన, నిధుల వినియోగం, ప్రజల అవసరాలకు అనుగుణంగా సత్వర స్పందనకు దోహదపడతాయని, గ్రామ స్వరాజ్యానికి దృఢమైన పునాది వేస్తాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు.

# మైనార్టీ గురుకులాల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లకు ఆహ్వానం

## జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



భద్రాద్రి కొత్తగూడెం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మైనారిటీ గురుకులాల అడ్మిషన్లు 2026--27 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి బ్రోచర్ ను కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఐడిఓసి క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలు తమ పిల్లలను మైనార్టీ గురుకుల పాఠశాల ఐదవ తరగతి, కళాశాల ఇంటర్ మీడియట్ లో చేర్పించాలని కోరారు. జిల్లాలో కొత్తగూడెంలో బాలికలకు, బాలురకు, బూర్గంపాడు బాలికలకు, భద్రాచలం బాలురకు, అశ్వారావుపేట బాలికలకు, ఇల్లందు బాలికలకు విడివిడిగా ఐదవ తరగతి, ఇంటర్ కళాశాలలు ఉన్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మైనారిటీల విద్యావకాశాల కోసం ఏర్పాటు చేసిన గురుకులాల విద్యావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మైనారిటీ గురుకులాల నాణ్యమైన ఉచిత విద్యావకాశాలపై అవగాహన కల్పించుటకు సీతారాములు అడ్మిషన్ల ప్రచార సాధనంగా రచించిన ఆడియో, వీడియో పాటలను జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కే. సంజీవరావు కార్యాలయంలో ప్రారంభించారు.

తమ పిల్లలను చేర్పించడానికి పూర్తి వివరాల కోసం సంబంధిత పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అభివృద్ధి అధికారి కే. సంజీవరావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఆర్.ఎల్.సి ఎం.జే. అరుణ కుమారి, ఉమ్మడి ఖమ్మం జిల్లా విజిలెన్స్ అధికారులు కే. సీతారాములు, ఎం.ఏ. రవూఫ్, జిల్లాలోని మైనారిటీ గురుకులాల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్ లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దావోస్‌లో 'నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30'

## ఆవిష్కరించనున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు



(హైదరాబాద్)

దావోస్‌లో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు జరిగే 'ప్రపంచ ఆర్థిక సదస్సు-2026'(డబ్ల్యూఈఎఫ్)లో తెలంగాణ 'నెక్స్ట్‌జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026-30'ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించనున్నారు. రాష్ట్ర అభివృద్ధిలో ఈ పాలసీ కీలక మలుపుగా మారనుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆసియాలోనే ప్రముఖ లైఫ్ సైన్సెస్ హబ్‌లలో తెలంగాణ ఒకటి. దేశ ఔషధ ఉత్పత్తిలో సుమారు 40 శాతం వాటాను తెలంగాణ కలిగి ఉంది. హైదరాబాద్ ఇప్పటికే పలు ప్రముఖ గ్లోబల్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలకు కేంద్రంగా మారింది. రాష్ట్రంలో 2 వేలకుపైగా లైఫ్ సైన్సెస్ పరిశ్రమలు ఉన్నాయి.

వీటి సంయుక్త విలువ సుమారు 80 బిలియన్ డాలర్లు. ప్రపంచ వ్యాక్సిన్ ఉత్పత్తిలో మూడో వంతు వాటాను కలిగి ఉండడంతో రాష్ట్రానికి 'వ్యాక్సిన్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్' అనే గుర్తింపు వచ్చింది. ఈ నేపథ్యంలో పెట్టుబడిదారులను ప్రోత్సహించి 2030 నాటికి 250 బిలియన్ డాలర్ల లైఫ్ సైన్సెస్ ఆర్థిక వ్యవస్థ నిర్మించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ మేరకు గ్లోబల్ వేదికపై ఆరోగ్య సంరక్షణ, లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణలకు తెలంగాణ నాయకత్వం వహించే విధంగా ఈ పాలసీని రూపొందించాలని సీఎం భావిస్తున్నారు.

# పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## ఫ్రై డే డ్రై డే ను పర్యవేక్షించిన డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ

భద్రాద్రి కొత్తగూడెం

పరిసరాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ శ్రీధర్ అన్నారు. డీఎం అండ్ హెచ్ఓ ఆదేశాల మేరకు శుక్రవారం మున్సిపాలిటీ పరిధి, శివలింగాపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆధ్వర్యంలో పరిసరప్రాంతాల్లో జరుగుతున్న ఫ్రైడే డ్రై డే ను డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ పర్యవేక్షించారు. ఈ సంధర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు లేకుండా, దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు ఉపయోగించాలని సూచించారు. ఆశా కార్యకర్తల సర్వే ను పరిశీలించి తగు సూచనలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని



సందర్శించి అటెండెన్స్, వ్యాక్సిన్ ఐ ఎల్ ఆర్ రూమ్, లాబ్, లేబర్ రూమ్, వార్డు లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఆయుష్ క్లినిక్ రూమ్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డా. సునీల్, డా. శివ కుమార్, డా. పావని సిబ్బంది పాల్గొన్నారు.

# సైబర్ అభద్రత.. ఆదాయ అసమానతలు.. భారత్‌కు ముప్పులివే..!

(హైదరాబాద్)

ఒకవైపు వివిధ దేశాలపై అమెరికా ఎడాపెడా సుంకాలు విధిస్తోంది. మరోవైపు సైబర్ నేరాలు, తప్పుడు సమాచార వ్యాప్తి ప్రజలకు సవాల్‌గా మారాయి. ఈ పరిణామాల నడుమ.. 2026కు సంబంధించి 'భౌగోళిక ఆర్థిక ఘర్షణల'ను ప్రపంచానికి అతిపెద్ద ముప్పుగా ప్రపంచ ఆర్థిక వేదిక పేర్కొంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ సమావేశాల సందర్భంగా తన వార్షిక 'అంతర్జాతీయ నష్ట ప్రమాద నివేదిక'ను విడుదల చేసింది. 1,300 మంది ప్రముఖులు, ఆయా రంగాల నిపుణులను సర్వే చేసి దీన్ని రూపొందించింది. భారత్ విషయంలో వచ్చే రెండేళ్లలో 'సైబర్ అభద్రత'ను అతిపెద్ద ముప్పుగా తెలిపింది.

2026కు సంబంధించి అంతర్జాతీయంగా భౌగోళిక ఆర్థిక ఘర్షణలు, సాయుధ ఘర్షణలు, విపత్కర వాతావరణ పరిస్థితులు, సామాజిక విభజన, తప్పుడు సమాచార వ్యాప్తిలను మొదటి ఐదు తీవ్ర ముప్పులుగా పేర్కొంది.

వచ్చే రెండేళ్లలో భౌగోళిక ఆర్థిక ఘర్షణలను అతిపెద్ద ముప్పుగా తేల్చింది. దీంతోపాటు తప్పుడు సమాచార వ్యాప్తి, సామాజిక విభజన, విపత్కర వాతావరణ పరిస్థితులు, సాయుధ ఘర్షణలను స్వల్పకాలిక ముప్పులుగా వర్గీకరించింది.

వచ్చే పదేళ్లలో వాతావరణ వైపరీత్యాలను తీవ్ర ముప్పుగా



పరిగణించింది. జీవవైవిధ్య నష్టం-పర్యావరణ వ్యవస్థ పతనం, భూమి ఆవరణ వ్యవస్థల్లో మార్పులు, తప్పుడు సమాచార వ్యాప్తి, ఏఐ సాంకేతికతల ప్రతికూల ఫలితాలను దీర్ఘకాలిక ముప్పులుగా పేర్కొంది.

భారత్ విషయానికొస్తే.. సైబర్ అభద్రత, ఆదాయ అసమానతలు, సామాజిక భద్రత- ప్రజాసేవలు సరిపడా అందుబాటులో లేకపోవడం, ఆర్థిక క్షీణత వంటివి తీవ్ర ముప్పులుగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా బ్యాంకింగ్ రంగాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చేందుకు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచిస్తూ.. భారత్‌కు చెందిన 'యూపీఐ'ను మంచి ఉదాహరణగా పేర్కొంది.

# ఎగుమతుల్లో తెలంగాణకు ఎనిమిదో స్థానం

(హైదరాబాద్)

ఎగుమతుల్లో దేశంలో తెలంగాణ రాష్ట్రం ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ మేరకు నీతి ఆయోగ్ 2024 ఎగుమతుల నివేదికను విడుదల చేసింది. మొదటి స్థానంలో 68.01 స్కోర్‌తో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. 64.41 స్కోర్‌తో తమిళనాడు రెండో స్థానంలో నిలవగా, 64.02 స్కోర్‌తో గుజరాత్, 62.09 స్కోర్‌తో ఉత్తరప్రదేశ్‌తో మూడు, నాలుగో స్థానాల్లోనూ నిలిచాయి. 60.65 స్కోర్‌తో ఆంధ్రప్రదేశ్ ఐదో స్థానంలో ఉంది. 57.14 స్కోర్‌తో తెలంగాణ ఎనిమిదో స్థానంలో నిలిచింది. పెద్ద రాష్ట్రాల్లో జార్ఖండ్ (42.49 స్కోర్), బీహార్ (46.31 స్కోర్), రాజస్థాన్ (47.31 స్కోర్) చివరి మూడు స్థానాల్లో ఉన్నాయి. చిన్న రాష్ట్రాల్లో ఉత్తరాఖండ్ (52.07 స్కోర్), జమ్మూ కాశ్మీర్ (51.08 స్కోర్), నాగాలాండ్ (46.42 స్కోర్) మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

లక్ష్యదీప్ (22.76 స్కోర్), మణిపూర్ (28.29 స్కోర్), మిజోరం (30.24 స్కోర్) చివరి మూడు స్థానాల్లో నిలిచాయి. 2024లో తెలంగాణ నుంచి రూ. 1.17 లక్షల కోట్ల ఎగుమతులు జరిగాయి. తెలంగాణ నుంచి యుఎస్ఎ (28.17 శాతం), యుఎఈ (6.90 శాతం), చైనా (5.21శాతం), సౌదీఅరేబియా (4.01 శాతం), కువైట్ (3.7 శాతం)కు ఎగుమతులు జరిగాయి. ఎరోస్పేస్ అండ్ డిఫెన్స్, ఎలక్ట్రికల్ పరికరాలు, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయ ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల నుంచి ఈ ఎగుమతులు ఎక్కువ ఉన్నాయి. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 4.8 శాతం నుంచి 5 శాతానికి పెరిగింది. 2023-24లో తెలంగాణ జీఎస్‌డీపీ రూ. 14.6 లక్షల కోట్లు చేరింది. 2024లో ఈ రాష్ట్రం మొత్తం రూ. 1.1 లక్షల కోట్ల విలువైన ఎగుమతులను రికార్డు స్థాయిలో నమోదు చేసింది.



అదే 2023లో రూ. 95 వేల కోట్లు ఉండేది. అదే విధంగా ఔషధాలు రూ. 24,187 కోట్లు, ఎయిర్‌క్రాఫ్ట్స్, స్పేస్ క్రాఫ్ట్స్, లాంచ్ వెహికల్స్ రూ. 14,670 కోట్లు, నైట్రోజన్ హెటెరోసైక్లిక్ సమ్మేళనాలు రూ. 5,036 కోట్లు, మిరియాలు, క్యాప్సికం రూ. 2,273 కోట్లు, యాంటీబయోటిక్స్ రూ. 1,858 కోట్లు, ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌ఫార్మర్స్, స్టాటిక్ కన్వెర్టర్స్ రూ. 1,726 కోట్లు, జ్యూవెల్లరీ ఆర్టికల్స్ రూ. 1,708 కోట్లు, ఆపరేషన్ కోసం మానవ రక్తం రూ. 1,569 కోట్లు, బియ్యం రూ. 1,094 కోట్లు, కాలబర్ నెట్‌వర్క్ కోసం టెలిఫోన్ సీట్స్ రూ. 1,049 కోట్లు ఎగుమతులు అవుతున్నాయి. మెదక్ నుంచి ఇంజినీరింగ్, ఆటో మోటివ్ రంగం నుంచి టెక్స్‌టైల్స్, లెథర్, ఫుడ్ ప్రాసెసింగ్, హైదరాబాద్ నుంచి ఫార్మాస్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఆటోమోటివ్, రంగారెడ్డి నుంచి ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్, నల్గొండ నుంచి సిమెంట్, ఫార్మాస్యూటికల్స్, టెక్స్‌టైల్స్ ఎగుమతవుతున్నాయి. తెలంగాణలో ఎగుమతులు 2023లో 2.6 శాతం ఉంటే, 2024లో 3.2 శాతానికి పెరిగినట్టు ట్రెండ్స్ స్పష్టం చేస్తున్నాయి.

# మార్చి 22న నిమ్స్‌లో ప్రొఫెసర్ కాకర్ల జాతీయ సదస్సు



(హైదరాబాద్)

నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్), సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ చాప్టర్ సంయుక్తాధ్వర్యంలో మార్చి 22న నిమ్స్‌లో ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో సదస్సు బ్రోచర్‌ను నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిమ్స్ రేడియాలజీ విభాగం దేశంలోనే ఆధునిక యంత్ర పరికరాలతో అగ్రగామిగా ఉందని తెలిపారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సాంకేతిక నిపుణులకు అందించడంలో జాతీయ స్థాయి సదస్సులు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. నిమ్స్ రేడియాలజీ సాంకేతిక నిపుణులు జాతీయ స్థాయిలో రాణించడం సంస్థకు గర్వకారణమనీ, ఇటీవల జాతీయ కౌన్సిల్ అధ్యక్షుడిగా నియమితులైన శ్రీనివాస్ ఇందుకు ఉత్తమ ఉదాహరణ అని అభినందించారు.. సదస్సులో రేడియాలజీ ఇమేజింగ్ సాంకేతిక విద్యార్థులు సమర్పించే ఉత్తమ పరిశోధన పత్రానికి ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు ఉత్తమ పరిశోధక పత్రం అవార్డు ప్రదానం చేయనున్నట్టు ప్రకటించారు. ఈ అవార్డు కింద నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తామన్నారు. రేడియాలజీ సాంకేతిక, సేవల విభాగంలో ఉత్తమ సేవలు అందించిన ప్రముఖ రేడియోగ్రఫీ సాంకేతిక నిపుణులకు ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రతి సంవత్సరం ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

ఈ ఏడాది ప్రొఫెసర్ కాకర్ల శత జయంతి అవార్డు -2025ను నిమ్స్ వైద్య అనుబంధ వత్తి విజ్ఞాన కళాశాల ప్రిన్సిపాల్,మెడికల్ రేడియాలజీ ఇమేజింగ్ అండ్ థెరప్యూటిక్ టెక్నాలజీ ప్రొఫెషనల్స్ జాతీయ కౌన్సిల్ అధ్యక్షుడైన శిరందాస్ శ్రీనివాస్‌కు ప్రదానం చేయనున్నట్టు సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకడమిక్ డైరెక్టర్, జ్యూరీ సభ్యులు దామోదర నాయుడు ప్రకటించారు. ఈ కార్యక్రమం గత 13 సంవత్సరాలుగా నిరంతరంగా నిర్వహించబడుతోందని తెలిపారు.

సదస్సులో దేశ నలుమూలల నుంచి రేడియాలజిస్టులు, సాంకేతిక నిపుణులు, రేడియాలజీ ఇమేజింగ్ విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి నిమ్స్ రేడియో డయాగ్నోసిస్ విభాగం సీనియర్ ప్రొఫెసర్, హెడ్ డాక్టర్ రామ్మూర్తి ఎస్ చీఫ్ పాట్రన్‌గా, కాకర్ల సుబ్బారావు రీసెర్చ్ ఎడ్యుకేషన్ సైన్సెస్ ట్రస్ట్ (కెఆర్ఇఎస్టీ) సభ్యులు డాక్టర్ ఎన్. కవిత రెడ్డి పాట్రన్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, డాక్టర్ పరంజ్యోతి, డాక్టర్ రాహుల్ దేవరాజు పాల్గొన్నారు. సదస్సులో పాల్గొనే ఆసక్తి కలిగిన విద్యార్థులు, రేడియాలజిస్టులు ఫిబ్రవరి 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ జాతీయ ఉపాధ్యక్షులు ఎం.ఏ.వారిస్, నేషనల్ సీఎంఈ -- 2026, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మహేష్ బసవేని సూచించారు.

# భర్తీకానీ పిజి మెడికల్ సీట్లు

## నీట్ 2025 కటాఫ్ మార్కులు తగ్గింపు

(న్యూఢిల్లీ)

రెండు రౌండ్ల కౌన్సిలింగ్ పూర్తయిన తరువాత కూడా పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లు భర్తీ కాలేదు. దీంతో నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్టు (పోస్టు గ్రాడ్యుయేట్) (నీట్-పిజి) 2025 అడ్మిషన్‌కు సంబంధించిన కటాఫ్ మార్కులను నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఇఎంఎస్) తగ్గించింది. ఈ విషయాన్ని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది.

మూడో రౌండ్‌లో రిజర్వ్‌డ్ కేటగిరిలకు కటాఫ్ మార్కులను 45 శాతం నుంచి సున్నాకు ఎన్‌బిఇఎంఎస్ తగ్గించినట్లు తెలిపింది. అంటే ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు చెందిన అభ్యర్థులు, నెగటివ్ మార్కులు వచ్చిన వారితో సహా పరీక్షకు హాజరైన అభ్యర్థులంతా కౌన్సిలింగ్‌లో పాల్గనడానికి అర్హులు అని తెలిపింది. వికలాంగుల అభ్యర్థులకు కటాఫ్‌లను 45 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గించారు. సాధారణ, ఆర్థికంగా బలహీన పడిన తరగతులు (ఇడబ్ల్యూఎస్)కు చెందిన అభ్యర్థులకు కటాఫ్‌ను 50 శాతం నుంచి ఏడు శాతానికి తగ్గించారు. కటాఫ్‌లను తగ్గించడంపై వస్తున్న విమర్శలను కేంద్రం తిరస్కరించింది. దేశంలో శిక్షణ పొందిన వైద్య నిపుణుల సంఖ్యను పెంచడానికి, అందుబాటులో ఉన్న సీట్లను సరైన రీతిలో ఉపయోగించుకోవడమే ఈ కటాఫ్ ఉద్దేశమని, సీట్లను ఖాళీగా ఉంచడం వల్ల ఆరోగ్య సంరక్షణను మెరుగుపర్చడానికి చేసే జాతీయ ప్రయత్నాలు దెబ్బతింటాయని, విలువైన విద్యా వనరులను కోల్పోతామని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. నీట్ -- పిజి అభ్యర్థులంతా ఎంబిబిఎస్



పూర్తి చేసిన వైద్యులని గుర్తు చేసింది. వీరు డిగ్రీలను, ఇంటర్న్‌షిప్‌లను పూర్తి చేశారని తెలిపింది.

2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం కోసం గతేడాది ఆగస్టులో నీట్_ పిజి 2025 పరీక్షను నిర్వహించారు. సుమారు 2.42 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. రెండు రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తయిన తరువాత కూడా దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో తొమ్మిది వేలకు పైగా మెడికల్ పిజి సీట్లు భర్తీ కాలేదని సమాచారం. దీంతో మూడో రౌండ్ కౌన్సిలింగ్ కోసం కటాఫ్‌ను తగ్గించారు.

Printed, Published and Owned by B.Buchibabu, printed at Moon printing press, Market Road, Vemulawada, Karimnagar 505302, Published at H.No.4-2-9, Temple Road, Vemulawada, Dist. Karimnagar 505302, Telangana. Editor. B.Buchibabu. RNI Number TELTEL/2015/62050. Cell : 92469 36059